PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 244 | విజయవాడ, సోమవారం 8 ఏప్రిల్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 8 April 2024 | Rs

మిమ్స్ ఆందోళనలో పది మంది అరెస్టు

- ఏడుగురికి రిమాండ్
- అరెస్టయిన వారిలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

3

ముంబయి మురిసింది



- ముంబయి ఇండియన్స్‌కు తొలి గెలుపు
- ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘన విజయం
- ముంబయి 234/5, ఢిల్లీ 205/8

6

ఫార్మాలో ఘోరం

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు కార్మికులు మృతి, ఐదుగురికి అస్వస్థత

ప్రజాశక్తి- పరవాడ (అనకాపల్లి)

అనకాపల్లి జిల్లాలోని ఫార్మా కంపెనీలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. పలువురి ప్రాణాలు బలిగొంటున్నాయి. భద్రతా చర్యల లేమి, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాద ఘటనలు తరచూ జరుగుతున్నా పూర్తి స్థాయి నివారణ చర్యలు తీసుకోవడం లేదు. ప్రమాద సందర్భంగా ఏర్పాటు చేసిన కమిటీలు నివేదికలు వెలుగు చూడడం లేదు. కొన్ని నెలల పరవాడ ఫార్మా సిటీలోని ప్రముఖ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి ఐదుగురు ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మరకముందే ర్యాంకీ ఫార్మా సిటీలో ఆదివారం తెల్లవారు జామున రెండు మందుల కంపెనీల్లో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. తాజా ప్రమాదాలపై పరవాడ పోలీసుల కథనం ప్రకారం... ఫార్మా సిటీలోని ఎపిటోరియా ఫార్మా కంపెనీ యూనిట్-4లో తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో రియాక్టర్ మ్యాన్‌హోల్ పేలింది. అది ఎగిరి అక్కడ విధులు నిర్వహిస్తున్న ఆళ్ల గోవింద్ (30)కు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన విజయనగరం జిల్లా గంట్యాడ మండలం సిరిపురం గ్రామానికి చెందినవారు. ఆరు నెలల నుంచి ఈ కంపెనీలో ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గోవింద్‌కు తల్లిదండ్రులు, అన్న, చెల్లి ఉన్నారు. మృతదేహాన్ని విశాఖ కెజిహెచ్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దచీశీఅవగఫార్మా సిటీలోనే అల్కలీ మెటల్స్ లిమిటెడ్ యూనిట్-3లో తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో మిథైల్ నైట్రేట్ కెమికల్ లీక్ అవడంతో ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు. వారిలో మిగతా 2లో





ప్రమాదం జరిగిన ఎపిటోరియా ఫార్మా కంపెనీ, అల్కలీ మెటల్స్ లిమిటెడ్



చందక రమణ (ఫైల్)



ఆళ్ల గోవింద్ (ఫైల్)

నేడు 93 మండలాల్లో వడగాడ్పులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 8న 93 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ పేర్కొన్నారు. 9న 27 మండలాల్లో వడగాడ్పులు, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 8న వడగాడ్పులు వీచే అవకాశం ఉన్న మండలాల్లో శ్రీకాకుళం జిల్లాలో 6, విజయనగరంలో 20, పార్వతీపురం మన్యంలో 8, అల్లూరి సీతారామరాజు 8, అనకాపల్లి 11, కాకినాడ 6, కోనసీమ 4, ఏలూరు 4, ఎన్‌టిఆర్ 2, గుంటూరు 7, పల్నాడు 2, తూర్పుగోదావరిలో 15 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల జిల్లా చాగలమర్రి, నెల్లూరు జిల్లా కలిగిరిలో 45.8 డిగ్రీల సెల్సియస్, వైఎస్ఆర్ జిల్లా ఖాజీపేట, సింహాద్రిపురంలో 45.6 డిగ్రీలు, బాపట్ల జిల్లా జనకవరం పంగులూరులో 45.5, కర్నూలు జిల్లా ఆలూరు, ప్రకాశం జిల్లా బొట్లగూడూరులో 45.4, పల్నాడు జిల్లా విజయపురిలో 45.2 అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. 107 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 235 మండలాల్లో వడగాడ్పులు వీచాయని తెలిపారు. ప్రజలు వీలైనంతవరకు ఇంట్లోనే ఉండాలని, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

దళిత యువకులపై దాడి

- ఇటుక రాళ్లు, గాజు సీసాలతో తెగబడిన పెత్తందారులు
- ఐదుగురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపు సావరంలో దళిత యువకులపై పెత్తందార్లు దాడి చేశారు. ఈ ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బాధితుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు, ఘటన జరిగి 24 గంటలు గడిచినా వార్త బయటకు పొక్కనీయకుండా చూడడం, నిందితులపై చర్యలు తీసుకోకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధితుల కథనం ప్రకారం... కడియపు సావరం గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి జాతర జరుగుతోంది. ఆదివారం రాత్రి మొదటి రోజు జాగారంలో భాగంగా గ్రామానికి చెందిన దళిత యువకులు జాతరలో పాల్గొన్నారు. గతేడాది జాతర సందర్భంగా దళితులు, పెత్తందారులకు చెందిన యువకుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జాతరలో దళిత యువకులను లక్ష్యంగా చేసుకుని శనివారం రాత్రి 11 గంటల ప్రాంతం నుంచే పెత్తందారులకు చెందిన కొందరు యువకులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో పదో తరగతి విద్యార్థిపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిని దళిత యువకులు అడ్డుకున్నారు. దీంతో, పెత్తందారీ యువకులు ఒక్కసారిగా ఇటుక రాళ్లు, గాజు సీసాలతో దాడికి తెగబడడంతో భయానక పరిస్థితి ఏర్పడింది. కొందరు గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం నుంచి అదనపు బలగాలు కడియపు సావరం గ్రామానికి వచ్చాయి. అప్పటికే దాడిలో గాయాలపాలైన దళిత యువకులను శీలం రాజేష్, రేగుళ్ల కార్తీక్, శీలం నరసింహం, రేగుళ్ల మహేష్, రేగుళ్ల సురేష్‌లతోపాటు మరికొంత మంది యువకులు అత్యవసర చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి వెళ్తుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. వారి సెల్‌ఫోన్లను లాక్కున్నారు. తీవ్రంగా గాయపడిన శీలం రాజేష్, రేగుళ్ల కార్తీక్‌లకు వైద్యం అందించాలని పోలీసులను ప్రాధేయపడినా బాధితులను తొలుత కాలు కదపనివ్వలేదు.

ఎట్టకేలకు వారిని కడియం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అదనపు బలగాలతోపాటు డిఎస్‌పి స్థాయి అధికారి కడియపు సావరం గ్రామానికి చేరుకుని పూర్తి స్థాయిలో గ్రామాన్ని దిగ్బంధనం చేశారు. బాధిత యువకుల కుటుంబ సభ్యులను గ్రామం విడిచి బయటకు మిగతా 2లో



గాయపడిన కార్తీక్

బిబిసి ప్రసారాలు సమాప్తం

BBC INDIA

- గుజరాత్ డాక్యుమెంటరీ నేపథ్యంలో కేంద్రం వేధింపులు
- ఐటి సోదాలు, వేధింపుల నేపథ్యంలో అసాధారణ నిర్ణయం
- 'కలెక్టివ్ న్యూస్‌రూమ్'కు ప్రసార లైసెన్సులు

న్యూఢిల్లీ : బ్రిటీష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బిబిసి) భారత్‌లో తన ప్రసారాలను నిలిపివేసింది. తన భారతీయ ఉద్యోగులు ఏర్పాటు చేసిన ప్రయివేటు లిమిటెడ్ కంపెనీకి ప్రచురణ లైసెన్సును అప్పగించింది. పన్ను ఉల్లంఘనల పేరుతో గతంలో బిబిసి కార్యాలయాలలో ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించడం, ప్రశ్నలు సంధించడం తెలిసిందే. ఈ వేధింపులు జరిగి సంవత్సరం కూడా పూర్తికాకముందే బిబిసి భారత్‌లోని తన న్యూస్‌రూమ్‌ను మూసేసింది. అంతర్జాతీయంగా ప్రసార సేవలు అందిస్తున్న ఓ ప్రభుత్వ సంస్థ తన కార్యకలాపాలను నిలిపివేయడం ప్రపంచంలో ఇదే మొదటిసారి. 'కలెక్టివ్ న్యూస్‌రూమ్' పేరిట ఏర్పడిన ప్రయివేటు లిమిటెడ్ కంపెనీతో బిబిసి కుదుర్చుకున్న ఒప్పందం ఈ వారంలోనే అమలులోకి వస్తుంది. ఈ కంపెనీని నలుగురు బిబిసి మాజీ ఉద్యోగులు ఏర్పాటు చేశారు. మన దేశంలో ఈ న్యూస్‌రూమ్‌కు చెందిన కార్యాలయాలు భారత్‌కు సంబంధించిన వార్తలు, ఇతర అంశాలను బిబిసి డిజిటల్ సర్వీసెస్ కోసం హిందీ, గుజరాతీ, మరాఠీ, పంజాబీ, తమిళం, తెలుగు భాషల్లో అందిస్తాయి. కొత్తగా ఏర్పడిన ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 26 శాతం వాటాల కోసం బిబిసి కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసిందని తెలిసింది.

అసాధారణ చర్యే

బిబిసి తన ప్రచురణ లైసెన్సును మరో సంస్థకు అప్పగించడం అసాధారణమని కలెక్టివ్ న్యూస్‌రూమ్ సిఇఒ రూపా ఝా తెలిపారు. జర్నలిజంలో రాజీ పడబోమని, తమ వెనుక బిబిసి ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. బిబిసి ఇండియాలో ఝా సీనియర్ న్యూస్ ఎడిటర్‌గా పనిచేశారు. కలెక్టివ్ న్యూస్‌రూమ్ వ్యవస్థాపక వాటాదారుల్లో ఆయన కూడా ఒకరు. మన దేశంలో బిబిసి నిర్వహిస్తున్న కార్యకలాపాలను పునర్నిర్మించాలంటే 2020లో ప్రవేశపెట్టిన నూతన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) నిబంధనలను అనుసరించాల్సి ఉంటుంది. వీటి ప్రకారం మిగతా 2లో

ఆప్ సామూహిక నిరాహార దీక్షలు

కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా దేశవ్యాప్తంగా ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌కు నిరసనగా ఆ పార్టీ నేతలు సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. ఢిల్లీ సహా దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ఆ పార్టీ నేతలు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. పంజాబ్, మధ్యప్రదేశ్, గోవా, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, రాజస్థాన్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, హర్యానా, గుజరాత్, జార్ఖండ్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో విశేష స్పందన లభించింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన నిరాహార దీక్షలో రాజ్యసభ ఎంపి సంజయ్ సింగ్, ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రామ్‌నివాస్ గోయల్, డిప్యూటీ స్పీకర్ రాఖీ బిల్లా, మంత్రులు అతిషి, గోపాల్ రాయ్, సౌరబ్ భరద్వాజ్, ఇమ్రాన్ హుస్సేన్, ఎంపి సందీప్ పాఠక్, సీనియర్ నేత సోమనాథ్ భారతి పాల్గొన్నారు. కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా మంత్రి గోపాల్ రాయ్ మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ పార్టీని నామరూపాలు లేకుండా చేయడం కోసమే బిజెపి ఈ తరహా కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. అందులో భాగంగానే ఢిల్లీ మద్యం కేసులో కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్ట్ చేసిందన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలకు చెందిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ఆయా ప్రభుత్వాలను కూలదోసేవారిపై పోరాటం ఆరంభమైందని ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రామ్‌నివాస్ గోయల్ అన్నారు.

కమలం పార్టీ నేతలు ఆప్‌ను చీల్చాలని కోరుకుంటున్నా తాము మరింతగా బలపడతామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య ప్రియులు అరవింద్ కేజ్రీవాల్‌కు బాసటగా నిలుస్తున్నారని అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్ స్వగ్రామమైన పంజాబ్‌లోని కత్‌కర్ కలాన్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆప్ నేత భగవంత్‌సింగ్‌మాన్ దీక్ష చేపట్టారు. ఈ నిరాహార దీక్షకు ప్రజలు పెద్ద ఎత్తున పోటెత్తారు. విదేశాల్లో సైతం కేజ్రీవాల్ అరెస్ట్‌కు నిరసనగా దీక్షలు చేపట్టారు. బోస్టన్‌లో హార్వర్డ్ స్క్వేర్, లాస్ ఏంజెల్స్‌లోని హాలీవుడ్ సైన్, వాషింగ్టన్ డిసిలోని భారత రాయబార కార్యాలయం వెలుపల, న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్, టోరంటో, లండన్, మెల్‌బోర్న్‌లోనూ నిరాహార దీక్షలు చేపట్టారు. ఢిల్లీ మద్యం కేసులో కేజ్రీవాల్ ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న సంగతి విదితమే.



ఢిల్లీలో ఆందోళన చేస్తున్న ఆప్ కార్యకర్తలు

సిఎం జగన్‌కు ఇసి నోటీసులు

- 48 గంటల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘనపై 48 గంటల్లో సమాధానం చెప్పాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మదనపల్లె, పూతలపట్టు, నాయుడుపేటలో ఈ నెల 2, 3, 4 తేదీల్లో ఏర్పాటు చేసిన సిద్ధం ఎన్నికల సభల్లో పశు పతి, శాడిస్టు, చంద్రముఖి అంటూ టిడిపి అధినేత చంద్రబాబుపై తప్పుడు వ్యాఖ్యలు చేశారని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఈ నెల 5న మీనాకు ఫిర్యాదు చేశారు. 'అవ్వతాతలు పెన్షన్ అందుకోలేక 31 మంది చనిపోయారని, వీరిని చంపిన చంద్రబాబును హంతకుడు అందామా? లేకపోతే అంతకన్నా దారుణమైన పదం ఉంటే అందామా?' అని నాయుడుపేటలో జగన్ చేసిన వ్యాఖ్యలనూ షోకాజ్ నోటీసుల్లో పేర్కొంది. ఈ అంశాలపై 48 గంటల్లోగా సమాధానం ఇవ్వాలని జగన్‌ను ఇసి ఆదేశించింది. నోటీసులతోపాటు వర్ల రామయ్య లేఖను కూడా జత చేసింది.

గుజరాత్ మోడల్ కాదు ద్రవిడ మోడల్ కావాలి

- కమల్‌హాసన్

చెన్నై : గుజరాత్ మోడల్‌ని వదిలి, దేశం ఇప్పుడు ద్రవిడ మోడల్‌ను అనుసరించాలని ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధ్యక్షుడు కమల్‌హాసన్ ప్రజలకు పిలుపునిచ్చారు. డిఎంకె దక్షిణ చెన్నై అభ్యర్థి తమిళచ్చి తంగపాండియన్‌కు మద్దతుగా మైలాపూర్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించి, నెలకు రూ.వెయ్యి నగదు పొందితే ఎంత బాగుంటుందో ఆలోచించాలని ప్రజలకు సూచించారు. గుజరాత్ మోడల్‌తో దేశంలో పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, నియంతృత్వం పెరిగిపోయాయన్నారు. భారతదేశం ద్రవిడ నమూనాను అనుసరిస్తే మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. చిన్న తరహా వ్యాపారాలు దెబ్బతినడంతో.. మహిళలు పనులకు వెళ్లేందుకు ఉచిత బస్సు ప్రయాణం కొంతమేర సహాయపడిందని తెలిపారు. సిఎఎతో రాజ్యాంగంపై దాడి జరుగుతోందని, దీంతో ఇప్పుడు మన హక్కులను మనం సాధించుకోవాలని అన్నారు.

మళ్లీ మోసగించేందుకే...

- ఎన్‌డిఎ కూటమి యత్నిస్తోంది
- బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో, పిసిపల్లి, కనిగిరి (ప్రకాశం జిల్లా)

చంద్రబాబు, మోడీ, దత్తపుత్రుడు 2014లో మాదిరిగానే ఇప్పుడూ కూటమి కట్టి ప్రజలను మరోసారి మోసగించేందుకు వస్తున్నారని, రాష్ట్రాన్ని వీరి మోసాల నుంచి కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని సిఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. బస్సు యాత్రలో భాగంగా ఆదివారం ఆయన ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంలోని కొనకన మిట్లలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అధికారంలోకొచ్చాక 99 శాతం అమలు చేశామని, సామాజిక న్యాయానికి పెద్దపీట వేశామని వివరించారు.

అందువల్లనే తలెత్తుకొని మాట్లాడుతున్నామన్నారు. 2014లో చంద్రబాబు, మోడీ, పవన్ కల్యాణ్ కలిసి కూటమిగా ఏర్పడి ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అయినా అమలు చేశారా? అని ప్రశ్నించారు. మోసాలు చేయడమే కూటమి అజెండా అని విమర్శించారు. 2014లో మిగతా 2లో



ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ఆలయ పరిసరాల్లో ఎన్నికల సభ

- బిజెపి నేత ఈశ్వరప్పపై ఇసి కేసు

బెంగళూరు : దక్షిణాదిలో ఉనికి చాటుకునేందుకు బిజెపి బరితెగిస్తోంది. ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కుతోంది. కర్ణాటకకు చెందిన ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి కెఎస్ ఈశ్వరప్ప ఏకంగా ఒక ఆలయం పరిసరాల్లోనే ఎన్నికల సభ నిర్వహించారు. దీనిపై ఎన్నికల సంఘం కన్నెర్ర చేసింది. సంబంధిత అధికారుల నుంచి ఎటువంటి ముందస్తు అనుమతులు తీసుకోకుండా ఆలయ పరిసరాల్లో ఎన్నికల సమావేశం ఎలా నిర్వహిస్తారంటూ ఆయనపై కేసు నమోదు చేసింది. వాస్తవానికి రాష్ట్ర బిజెపి తీరుపై ఆయన గుర్రుగా ఉంటూవస్తున్నారు. శివమొగ్గలో తనకు టిక్కెట్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతానని ప్రకటించారు. నోనాబుర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అంబుతీర్థ ఆలయ పరిసరాల్లో ఆయన తన అనుచరులతో ఎన్నికల కసరత్తు కోసం ఈ నెల 5న సమావేశం నిర్వహించారు. ఆలయంలోని మైకు, ఇతర సామగ్రిని వాడుకున్నారు. ఆలయంలోనే ఉన్న పూజారి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో 60 మంది పైగా బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు. ఇలాంటి సమావేశాల కోసం జిల్లా ఎన్నికల అధికారి (డిఇఒ) నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాల్సి ఉన్నా ఈశ్వరప్ప అనుమతులు తీసుకోలేదు.



కృష్ణా జిల్లా పామర్రులో ప్రజాగళం బహిరంగ సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ కార్పొరేషన్లు బలోపేతం

- పామర్రు, ఉయ్యూరు 'ప్రజాగళం' సభల్లో చంద్రబాబు

ప్రజాశక్తి- కృష్ణా, గుంటూరు ప్రతినిధులు

బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ కార్పొరేషన్లను బలోపేతం చేస్తామని టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. 'టిడిపి ప్రజాగళం' యాత్రలో భాగంగా ఆదివారం గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఆయన పర్యటించారు. కృష్ణా జిల్లా పామర్రులో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద, ఉయ్యూరులోని నాలుగు రోడ్ల కూడలిలో జరిగిన సభల్లో చంద్రబాబు మాట్లాడుతూ నిధుల్లేక కూనరిల్లుతున్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ కార్పొరేషన్లకు తాము అధికారంలోకి వస్తే తగినన్ని నిధులు అందించి బలోపేతం చేస్తామన్నారు. వ్యవసాయ కార్మికుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులతోపాటు అన్ని వర్గాల ప్రజలు మిగతా 2లో

వడదెబ్బకు వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-అవనిగడ్డ (కృష్ణాజిల్లా)

వడదెబ్బకు ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అవనిగడ్డ మండల పరిధిలోని పులిగడ్డ గ్రామానికి చెందిన మండలి బాలసుబ్రమణ్యం (77) ఎండకు తట్టుకోలేక శనివారం మధ్యాహ్నం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందారు. సుబ్రహ్మణ్యానికి భార్య, కుమారులు ఉన్నారు.

రూ.26 లక్షల నగదు స్వాధీనం

- బంగారు ఆభరణాలు సీజ్

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రంలో ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ భారీగా నగదు పట్టుబడుతోంది. ఈ నేపథ్యంలో పోలీసుల ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహన తనిఖీలు చేపడుతున్నారు. అధిక మొత్తంలో తరలిస్తున్న డబ్బు, నగలను స్వాధీనం చేస్తున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేస్తున్నారు.

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఎపిఎస్‌ఆర్‌టిసి కార్గో సర్వీసు వాహనంలో డ్రై ఫ్రూట్స్ పెట్టెల మధ్య తరలిస్తున్న రూ.22.63 లక్షల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి జంగారెడ్డిగూడెం వస్తున్న ఆర్‌టిసి కార్గో వాహనం పట్టణంలోకి ప్రవేశిస్తుండగా అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో డ్రైఫ్రూట్స్ పెట్టెల మధ్య నగదు ఉంచి తరలిస్తుండటాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు లేకపోవడంతో సీజ్ చేసినట్లు జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర తెలిపారు. ఏలూరు శివారు తంగెళ్లమూడి వద్ద ఓ కారులో తరలిస్తున్న సుమారు రూ.3.66 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బాపట్ల జిల్లా మార్టూరులో ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న వెండి, బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వలపర్ల గ్రామానికి చెందిన బంగారు వ్యాపారి కొల్లిపర నాగసుపేరావు తన ద్విచక్ర వాహనంలో రూ.9 లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలను తీసుకెళ్తుండగా మార్టూరులో పోలీసులు పట్టుకున్నారు. వీటికి సంధించి సరైన పత్రాలు చూపకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నామని సిఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ కార్పొరేషన్లు బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంటలకు కనీస మద్దతు ధరలు అందక రైతులు, కౌలు రైతులు నష్టపోయారన్నారు. ఆయా తరగతుల ఉన్నతికి రుణాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కృష్ణా డెల్టాలో తాగు, సాగు నీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి పోలవరం నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. రోడ్లపై గుంటలు పూడ్చలేని వ్యక్తి మూడు రాజధానులు కడతానని చెబుతున్నారని సిఎం జగన్‌ను ఎద్దేవా చేశారు. రాజధాని అమరావతి పూర్తయి ఉంటే ప్రభుత్వానికి ఆదాయం వచ్చేదన్నారు. రాష్ట్రంలోని యువత ఉపాధి కోసం హైదరాబాద్ వలస వెళ్లాల్సి వస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డిఎస్‌సి నిర్వహిస్తామని, జాబ్ కేలండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. పరిశ్రమలను తీసుకొచ్చి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. సైబరాబాద్ తరహాలో ఎక్కడిక్కడ ఐటి టవర్లు ఏర్పాటు చేసి యువతకు వర్క్ ఫ్రం హోం పద్ధతిలో ఉద్యోగాలు చేసుకునే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పేదరికం లేని రాష్ట్రాన్ని చూడాలనేది తన కోరికన్నారు. వినాశకరమైన వైసిపి పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని కోరారు. జగన్ పాలనలో వేధింపులకు గురైన దళితులు అనేకమంది ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. తాము గతంలోనూ ఎన్‌డిఎలో ఉన్నామని, అప్పట్లో మైనారిటీలకు ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకున్నామని, ఇప్పుడూ అలానే వ్యవహరిస్తామని చెప్పుకొచ్చారు.

వికలాంగులకు రూ.6 వేల పింఛను ఇస్తాం

తాము అధికారంలోకి రాగానే వికలాంగులకు ఆరు వేల రూపాయలు పింఛను ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి శ్రీ వెంకటేశ్వర గ్రాండ్ కల్యాణ మంటపంలో వికలాంగులతో ఆదివారం సమావేశమయ్యారు. చంద్రబాబును విభిన్నప్రతిభావంతుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఎంఆర్‌పిఎస్ నాయకులు, విభిన్న ప్రతిభావంతుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణ మాదిగ కలిసి పింఛను పెంపుపై చర్చించారు. రూ.3 వేల నుంచి 6 వేలు పింఛను పెంచాలని కోరారు. ఈ నేపథ్యంలో పైమేరకు చంద్రబాబు హామీ ఇచ్చారు.

గుంటూరు, పల్నాడు జిల్లాల అభ్యర్థులతో భేటీ

పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో టిడిపి అభ్యర్థులతో ముఖాముఖీగా రహస్యంగా మాట్లాడారు. నియోజకవర్గాల వారీగా సమీక్ష చేశారు. తగినంత సమయం ఉందని, ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించాలని, విజయం కోసం అందరినీ కలుపుకెళ్లాలని సూచించారు.

చికెన్ @ రూ.300

• 15 రోజుల్లో రూ.100కి పైగా పెరిగిన ధర • రైతుకు దక్కుతున్నది రూ.132 మాత్రమే



చికెన్ షాపు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

మండుతున్న వేసవితో పాటు చికెన్ ధరలూ భగ్గుమంటున్నాయి. చికెన్ ప్రియులకు ధరల షాక్ తగిలింది. సామాన్యుడు చికెన్ కొనాలంటే పర్సును ఒకటికి రెండుసార్లు తడుముకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో చికెన్ ధర రూ.300కు చేరింది. ఇందులో రైతుకు దక్కుతున్నది రూ.132 మాత్రమే. దళారులు, వ్యాపారులు సరాసరి కేజీకి రూ.168 చొప్పున లాభాలు ఆర్జిస్తున్నారు. 15 రోజుల క్రితం రైతులకు రూ.88 నుంచి రూ.90 ధర వచ్చేది. వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో కోళ్లు మృత్యువాత పడడం, కొందరు రైతులు కొత్త బ్యాచ్‌లు వేయకపోవడంతో డిమాండ్‌కు తగ్గ సరఫరా లేదు. రిటైల్ మార్కెట్లో 15 రోజుల క్రితం రూ.200 ఉన్న ధర తాజాగా రూ.100 పెరిగింది. మరో 20 రోజుల పాటు ఇదే ధర కొనసాగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నాయి. గత నెలలో కోడి (లైవ్) కేజీ ధర రూ.120 ఉండగా, అది ప్రస్తుతం రూ.166కు చేరింది.

పెరిగిన ఉష్ణోగ్రతలతో మృత్యువాత

ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెల్సియస్ దాటితే కోళ్ల మనుగడ కష్టతరమవుతోంది. వారం రోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. ఈ నేపథ్యంలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. బ్యాచ్‌లో సగానికిపైగా కోళ్లు మృత్యువాత పడుతున్నాయని పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు. దీంతో, కోళ్లు సరైన బరువు రాకముందే విక్రయించాల్సి వస్తోందని తెలిపారు. మరోవైపు కార్పొరేట్ సంస్థల నుంచి పోటీని స్థానిక పౌల్ట్రీ రైతులు తట్టుకోలేకపోతున్నారు. కార్పొరేట్ కంపెనీల నుంచి దిగుమతి అవుతున్న కోళ్లతో పోల్చితే లోకల్ కోళ్లు తక్కువ బరువు ఉంటున్నాయి. దీంతో, పోటీని తట్టుకోలేక దళారులు అడిగిన ధరలకు రైతులు విక్రయించక తప్పడం లేదు. రైతుల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసిన దళారులు మరో రెండు వారాల్లో ధరలు మరింత పెరుగుతాయనే అంచనాతో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా లేకపోవడంతో ధరలు క్రమంగా పెరుగుతూ వచ్చాయని పౌల్ట్రీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 350 పైగా కోళ్ల ఫారాలు ఉన్నాయి. ప్రతి రోజూ 1.40 లక్షల కోళ్లు విక్రయం జరుగుతుంటాయి. రాష్ట్రంలో పలు ప్రాంతాలకు ఇక్కడి నుంచే సరఫరా అవుతున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 50 వేల మంది రైతులు, వ్యాపారులు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. కొన్నేళ్లుగా దాణా ధరలు, విద్యుత్ ఛార్జీలు పెరగడంతో పౌల్ట్రీ రైతులు నష్టాల బాట పట్టారు. ఆక్వా రంగానికి ఇచ్చినట్లుగా తమకూ రాయితీ విద్యుత్ ఇవ్వాలని కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. నష్టాలతో కొంతమంది ఇతర రంగాలకు తరలిపోతున్నారు. వేసవి ఉష్ణోగ్రతలు, వ్యాధులతో ఈ రంగం కుదేలైంది. నెల రోజులుగా ఉమ్మడి జిల్లాలో 25 శాతం కోళ్లు మృత్యువాత పడినట్లు రైతులు చెబుతున్నారు.

రూ.150 వస్తేనే గిట్టుబాటు

వేసవి ఉష్ణోగ్రతలు పౌల్ట్రీ రంగంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. కొన్ని పౌల్ట్రీలో బ్యాచ్‌లకు బ్యాచ్‌లే మృత్యువాత పడ్డాయి. డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా లేకపోవడంతో చికెన్ ధరలు పెరిగాయి. ప్రస్తుత రైతుకు కేజీకి రూ.132 మాత్రమే ధర దక్కుతోంది. ఇటువంటి సమయంలోనైనా కనీసం కేజీకి రూ.150 ఇస్తేనే గిట్టుబాటు అవుతుంది. కోడి పిల్ల ధర ప్రస్తుతం రూ.56కు చేరింది. దాణా ధరలు, విద్యుత్ ఛార్జీల పెంపుతో నష్టాలను చవిచూస్తున్నాము.

- మజ్జి రాంబాబు, పౌల్ట్రీ రైతు

ఇలాగైతే కొనలేం

చికెన్ ధరలు ఎన్నడూ లేనంతగా పెరిగాయి. సహజంగా ఎండా కాలంలో ధరలు పెరగడం పరిపాటి. ఈ ఏడు ఏప్రిల్‌లోనే గరిష్టంగా రూ.300 చేరింది. రాబోయే రోజుల్లో మరింత ధరలు పెరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరకు చికెన్‌ను కొనే పరిస్థితి లేదు.

-నక్కా ప్రభాకర్, కొనుగోలుదారుడు, గోపాలపురం

వ్యాపారాలు లేవు



చికెన్ ధరలు పెరగడంతో ఆశించిన స్థాయిలో వ్యాపారాలు లేవు. వారంలో ఒక్క రోజు మాత్రమే మాకు విక్రయాలు అధికంగా ఉంటాయి. కనీసంగా ఒకొక్క చికెన్ షాపు 80 నుంచి 90 కేజీలు విక్రయిస్తుంటాము. ఈ ఆదివారం 60 కేజీలు కూడా విక్రయించలేకపోయాము. ధరలు అందుబాటులో ఉంటేనే మంచిది.

- రిజ్వాన్, చికెన్ వ్యాపారి గోపాలపురం

విమర్శలకే పరిమితం

- ఉక్కు పరిరక్షణపై స్పష్టత ఇవ్వని పవన్
- అనకాపల్లిలో వారాహి విజయ భేరి యాత్ర



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

'స్టీల్ ప్లాంట్ అమ్మకంపై ప్రధానిని తిడితే లాభం లేదు. పిఎం దగ్గరకు వెళ్దామని చెప్పినా రావడానికి ఎవరూ ముందు కురాలేదు' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. అనకాపల్లిలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన వారాహి విజయ భేరి యాత్రలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలన్న కోరిక తనకు ఉందని.. అయితే, ప్లాంట్ రక్షణ తన ఒక్కడి వల్లే సాధ్యం కాదని చెప్పుకొచ్చారు. ఉక్కు పరిరక్షణకు తాము ఏం చేస్తామన్న విషయంపై మాత్రం ఆయన స్పష్టత ఇవ్వలేదు. ప్లాంట్‌కు సొంత గనుల అవసరాన్ని జాతీయ నాయకులకు వినిపిస్తానని మాత్రమే చెప్పారు. తన పోరాటం వల్లే ఉద్దానం సమస్య పరిష్కారమైందని తెలిపారు. చెత్త పన్ను తొలగించాలని చంద్రబాబుకు చెబుతానని అన్నారు. అక్రమ క్వారీల అనుమతులు రద్దు చేస్తామని పేర్కొన్నారు. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని తెరిపించి దానికి అనుసంధానంగా ఇథనాల్ తయారు చేసి ఎగుమతి చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. సిఎం జగన్ ఇసుక, సారా వ్యాపారి, భూ దోపిడీదారు అని ఆరోపించారు. క్రిమినల్ ప్రభుత్వం వైసిపిని రోడ్డుపైకి ఈడ్చి రాష్ట్ర సరిహద్దు అవతల పడేస్తామన్నారు.

యువతలో ప్రతిభను వెలికి తీసేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పకుండా, ప్రభుత్వ ఉద్యోగికి భద్రత ఉండేలా ఏడాదిలోపు చర్యలు తీసుకుంటామని పవన్ చెప్పుకొచ్చారు. బరోడా తరహాలో అనకాపల్లి డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు శుద్ధి చేసే ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇపిడిసిఎల్‌లో విలీనం చేసిన కశింకోట సహకార విద్యుత్ సంస్థను తిరిగి సహకార రంగంలో కొనసాగేలా చూస్తామని, బెల్లం రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. విస్సన్నపేటలో కోడి గుడ్డు మంత్రి 609 ఎకరాలు అక్రమించారని అమర్‌నాథ్‌పై విమర్శలు సంధించారు. శారద నది తీరం, బొజ్జన్న కొండ ప్రాంతాలను టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దితే యువతకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. సుజల స్రవంతికి బడ్జెట్ కేటాయిస్తామని చెప్పారేగానీ ఎప్పటిలోగా పూర్తి చేస్తారో పవన్ చెప్పలేకపోయారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. ఈ సభలో అనకాపల్లి బిజెపి ఎంపి అభ్యర్థి సిఎం.రమేష్, అనకాపల్లి, పెందుర్తి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థులు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ ధర్నా చౌక్ వద్ద దీక్ష చేస్తున్న ఆప్ నాయకులు

కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ .. ఆప్ నాయకుల దీక్ష

- సిపిఎం సహా పలు పార్టీల సంఘీభావం

ప్రజాశక్తి - కాకినాడ

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఆదివారం కాకినాడలోని ధర్నా చౌక్ వద్ద ఉపవాస దీక్ష చేపట్టారు. ఈ దీక్షనుద్దేశించి ఆప్ జిల్లా కన్వీనర్ నరాల శివ మాట్లాడుతూ.. ఎలోక్టోరల్ బాండ్ల కుంభకోణంలో ప్రజల దృష్టిని మరలించేందుకే అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఘోరమైన ఓటమి తప్పదని గ్రహించిన బిజెపి ప్రభుత్వం ఇతర పార్టీల ముఖ్యమంత్రులను, నాయకులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఇడి, సిబిఐ, ఐటి సంస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని అక్రమ కేసులు బనాయిస్తూ జైళ్ల పాలు చేస్తోందని విమర్శించారు. ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కాళ్లూరి కృష్ణమోహన్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించాలని కోరారు. బిజెపి మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ఎంతటి నీచానికైనా దిగజారుతోందని విమర్శించారు.

ప్రతి ఒక్కరు బిజెపి తీరును ఖండించాల్సిన అవసరముందన్నారు. సిపిఎం నాయకులు జుత్తుక శ్రీను, సిఐటియు నాయకులు రమణ, ఆర్‌బిఐ పార్టీ నాయకులు పిట్ట వరప్రసాద్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర మాజీ కన్వీనర్ వరప్రసాద్, పార్టీ నాయకులు రియాజ్ మహమ్మద్, వై.రాంబాబు, ఎన్ఎస్.రామారావు, మహాలక్ష్మి, గ్రంథి నాగేశ్వరరావు, వంగపండు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో చంద్రబాబు, పవన్ ఉమ్మడి ప్రచారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఈ నెల 10, 11 తేదీల్లో ఉమ్మడి ప్రచారం నిర్వహించనున్నారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు సమయం దగ్గర పడుతుండటంతో ప్రచారాన్ని కలిసి నిర్వహించే విధంగా కూటమి ప్రణాళికలు రచిస్తోంది. ప్రజాగళం మూడో విడత కార్యక్రమం ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు, పవన్ కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. 10వ తేదీన తణుకు, నిడదవోలు నియోజకవర్గాల్లో జరగనున్న ప్రజాగళంలో ఇరువురు పాల్గొంటారు. 11న పిగన్నవరం, అమలాపురం నియోజకవర్గాల్లో ఉమ్మడి ప్రచారం చేయనున్నారు. చంద్రబాబు, పవన్ ఉమ్మడి కార్యక్రమాల తరువాత బిజెపి జాతీయ నాయకులతో కలిసి మూడు పార్టీల నాయకులు కలిసి ప్రచారం చేయనున్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాలతో కలిసి చంద్రబాబు, పవన్ ప్రచారం నిర్వహించే అవకాశం ఉందని ఆయా పార్టీల నేతలు చెబుతున్నారు.. ఇప్పటికే మోడీ చిలకలూరిపేటలో జరిగిన కూటమి బహిరంగ సభలో పాల్గొన్నారు. ఇదే తరహాలో రాయలసీమలో ఒక సభ, కోస్తాంధ్రలో మరోసభ నిర్వహించాలని కూటమి పార్టీలు ఆలోచిస్తున్నాయి. రాయలసీమలో సభను తిరుపతిలో జరుపుదామనే అభిప్రాయం నేతల్లో ఉంది. ఇప్పటికే ఈ అంశంపై మూడు పార్టీలు చర్చించినట్లు సమాచారం.

బిబిసి ఇండియా ప్రసారాలు సమాప్తం

(మొదటి పేజీ తరువాయి)

దేశీయ డిజిటల్ మార్కెట్ రంగంలో విదేశీ కంపెనీల ఎఫ్‌డిఐ పరిమితి 26 శాతం మాత్రమే. గతంలో దేశంలో బిబిసి ఎడిటోరియల్ కార్యకలాపాలను బిబిసి ఇండియా నిర్వహించేది. ఇందులో 99 శాతానికి పైగా వాటాలు బ్రిటన్‌కు చెందిన బిబిసివే. అయితే పెట్టుబడులపై ఆంక్షలు విధించడంతో 26 శాతం ఎఫ్‌డీఐ పరిమితిని దాటిన కంపెనీలు తమ విదేశీ పెట్టుబడులను 2021లో విధించిన నియంత్రణలకు అనుగుణంగా తగ్గించుకోవాల్సి ఉంటుంది.

'గుజరాత్' డాక్యుమెంటరీ ప్రసారమే కారణం

బిబిసి ఇండియా బ్యూరోలో 200 మంది పనిచేస్తున్నారు. బ్రిటన్ వెలుపల మన దేశంలోనే బిబిసి కార్యకలాపాలు పెద్ద ఎత్తున నడుస్తున్నాయి. 1940 మేలో బిబిసి మన దేశంలో ప్రసారాలను ప్రారంభించింది. గత సంవత్సరం ఫిబ్రవరిలో ఢిల్లీ, ముంబయిలోని దాని కార్యాలయాలలో ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. 2002లో జరిగిన గుజరాత్ అల్లర్లపై బిబిసి ఓ డాక్యుమెంటరీని ప్రసారం చేసిన కొద్ది రోజులకే దాడులు, సోదాలు జరగడం గమనార్హం.

ఇష్టం లేకపోయినా...

ఎఫ్‌డిఐపై నూతన నిబంధనలు అమలులోకి రావడంతో బిబిసి కార్యకలాపాలపై నీలినీడలు కమ్ముకొన్నాయి. అయినప్పటికీ ఆ సంస్థ మన దేశంలో తన ఉనికిని కోల్పోవడాన్ని ఇష్టపడలేదు. ఉద్యోగాలలో కోత విధించాలని కోరుకోలేదు. అదే సమయంలో ఆర్థికంగా ఇబ్బందులు పడడాన్ని జీర్ణించుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో ఇష్టం లేకపోయినా విధిలేని పరిస్థితులలో కార్యకలాపాలను నిలిపివేయాలని నిర్ణయం తీసుకుంది. బిబిసి అందుకున్న న్యాయ సలహా ఆధారంగా కలెక్టివ్ న్యూస్‌రూమ్ ఏర్పాటుకే అందరూ మొగ్గు చూపారని ఝూ చెప్పారు. తాజా పరిణామాలపై బిబిసి న్యూస్ డిప్యూటీ సిఇఒ జోనాథన్ మన్రో వ్యాఖ్యానిస్తూ 'భారత్‌లో బిబిసి మనుగడకు ఘన చరిత్ర ఉంది. ప్రేక్షకులకే తొలి ప్రాధాన్యత ఇచ్చాం. ఈ పురోగతిని ముందుకు తీసికెళ్లడానికి కలెక్టివ్ న్యూస్‌రూమ్ ఏర్పాటు దోహదపడుతుంది. దీనిని మేము స్వాగతిస్తున్నాం' అని చెప్పారు.

బిజెపిని, దాని మిత్రులను ఓడిస్తేనే ఉక్కుకు రక్షణ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

రానున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బిజెపిని, ఆ పార్టీ మిత్రులుగా ఉన్న టిడిపి, జనసేన, వైసిపిలను ఓడిస్తేనే స్టీల్‌ప్లాంట్‌కు రక్షణ ఉంటుందని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ మరడాన జగ్గునాయుడు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1151వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) కార్యకర్తలు కూర్చున్నారు.

దళిత యువకులపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

రానీయకుండా అడ్డుకున్నారు. తెల్లవారు జాము నాలుగు గంటల సమాయానికి పోలీసు ఉన్నతాధికారి ఒకరు కడియం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఘటనపై ఆరా తీసినట్టు సమాచారం. అనంతరం యువకులను మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన శీలం రాజేష్ రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆసుపత్రిలో ఐసియులో చికిత్స పొందుతున్నారు. బాధితులను గంటలపాటు పోలీస్ స్టేషన్లోనే నిర్బంధించడం, దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఘటనకు సంబంధించిన వివరాలను ప్రధాన వార్తా స్రవంతిలోగానీ, సోషల్ మీడియాలోగానీ రానీయకుండా పోలీసులతోపాటు, కొందరు స్థానిక రాజకీయ నాయకులు జాగ్రత్తలు పడ్డారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

గ్రామంలో ఇరు గ్రూపుల యువకులు ఘర్షణ పడడంతో కేసు నమోదు చేశాం. గ్రామానికి చెందిన బాలు, ఆది, మున్నా, సాల్మన్ రాజు మరికొందరు యువకులు తనపై దాడి చేశారని రాజేష్ వాంగ్మూలం ఇచ్చారు. దాడికి పాల్పడిన వారిని సిసి కెమెరా ఫుటేజ్ ఆధారంగా గుర్తిస్తున్నాము. వివాదానికి కారణమైన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. సున్నితమైన అంశం కావడంతో ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నాం.

-తులసీధర్, కడియం సిఐ

ఆస్తుల విలువ దాచిపెట్టిన బిజెపి అభ్యర్థి

- ఇసికి సిపిఎం ఫిర్యాదు



న్యూఢిల్లీ: మోడీ ప్రధాని అయ్యాక దేశంలో చోటుచేసుకున్న అవినీతి కుంభకోణాల్లో బిజెపి అగ్రస్థానంలో నిలిచింది. అంటే, అంతర్జాతీయ ఆర్థిక మోసాల కేసుల మొదలు సాధారణ స్థానిక పేలుళ్ల (రమేష్ వరం కాబే) ఘటనల వరకు, బిజెపి వ్యక్తుల పాత్ర లేకుండా ఏమీ జరగదు. దటీజ్ బిజెపి. ఇప్పుడు ఇంకో అంశంలో అది ఘనత సాధించింది. ఎన్నికల నామినేషన్లకు సంబంధించిన ఆస్తుల వివరాలతో కూడిన అఫిడవిట్‌లో బిజెపి అభ్యర్థులు అక్రమాలకు తెరతీశారు. కేరళలోని తిరువనంతపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ గురువారం తన ఆస్తుల వివరాలతో కూడిన ఒక అఫిడవిట్‌ను నామినేషన్ పత్రంతోబాటు దాఖలు చేశారు. ఆ అఫిడవిట్‌లో రాజీవ్ చంద్రశేఖర్ తన ఆస్తులకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించలేదని, ఆయన కంపెనీ -జుపిటర్ కేపిటల్- గురించి పేర్కొనకుండా దాని అనుబంధ సంస్థల గురించి పేర్కొన్నారని, ఇలాంటివే అనేక తప్పుడు, బూటకపు సమాచారాన్ని ఇచ్చారనిసిపిఎం ఆరోపించింది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ వద్ద తిరువనంతపురం ఎల్‌డిఎఫ్ కమిటీ ఓ పిటిషన్‌ను ఓ పిటిషన్ దాఖలు చేసింది. అందులో "కేంద్ర మంత్రి రాజీవ్ చంద్ర శేఖర్ ఆస్తుల విలువను దాచిపెట్టి రూ.26 కోట్ల ఆస్తులు మాత్రమే ఉన్నట్లు చూపించారని, ఆయన చూపిన రూ.26 కోట్ల ఆస్తుల్లోలగ్జరీ కార్లు, విలాసవంతమైన బంగ్లా, ఇతర స్థిరాస్థుల గురించి ఎక్కడా పేర్కొనలేదన్నారు. ఆయన అఫిడవిట్‌లో పేర్కొన్నదానికన్నా కొన్ని వందల రెట్లు అధికంగా ఉన్నాయని ఆ ఫిర్యాదులో సిపిఎం పేర్కొంది. కాంగ్రెస్ కూడా అంతకుముందు ఇదే విధమైన ఫిర్యాదు చేసింది. రాజీచ్ చంద్రశేఖర్ వాస్తవిక ఆస్తుల విలువ దాదాపు రూ.8,000 కోట్లు దాకా ఉన్నట్లు కాంగ్రెస్ పేర్కొంది. రూ.6.3 కోట్లుగా చూపిన 4 కంపెనీల విలువ రూ.1,610 కోట్లుగా కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పేర్కొన్న విషయాన్ని , అలాగే. అతను తన స్వంత విమానం కూడా కలిగి ఉన్నారనే విషయాన్ని చంద్రశేఖర్ దాచిపెట్టారని కాంగ్రెస్ తన ఫిర్యాదులో పేర్కొంది. రాజీవ్ చంద్రశేఖర్ ఆస్తుల వివరాలు ఇప్పటికే పలు మీడియాల్లో ప్రచురితమయ్యాయి. కాబట్టి తప్పుడు అఫిడవిట్ దాఖలు చేసిన రాజీవ్ చంద్రశేఖర్ నామినేషన్ ను తిరస్కరించాలని సిపిఎం కోరింది. .రాజీవ్ చంద్రశేఖర్ లాగే పలువురు బిజెపి అభ్యర్థులు తమ ఆస్తులను దాచుకున్నట్లు సమాచారం

ఫార్మాలో ఘోరం

(మొదటి పేజీ తరువాయి)

చందక రమణ (33) అనకాపల్లిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం గొల్లపేట గ్రామానికి చెందిన ఆయనకు భార్య, పాప, బాబు ఉన్నారు. రమణ 12 సంవత్సరాల నుంచి ఈ కంపెనీలో సెక్షన్ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. అస్వస్థతకు గురైన వారిలో ఇద్దరు కార్మికులు విశాఖలోని కిమ్స్ ఐకాన్‌లో చికిత్స పొందుతున్నారు. వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మరో నలుగురు కార్మికులు అనకాపల్లిలోని శ్రీరామ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. ఘటనా స్థలాలను ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ సందర్శించి ప్రమాదాలకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఫార్మా సిటీలోని కార్మికుల ప్రాణాలను యాజమాన్యాలు గాలికి వదిలేస్తున్నాయని, భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని తెలిపారు.

యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి : సిపిఎం, సిఐటియు

ఫార్మా సిటీలో జరిగిన ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపి యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిపిఎం, సిఐటియు వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశాయి. మరణించిన కార్మికుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం కోరారు. ప్రభుత్వం, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఫార్మా సిటీలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు తెలిపారు.

మొక్కుబడిగా తనిఖీలు...వెలుగుచూడని నివేదికలు

అనకాపల్లి జిల్లా పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో విస్తరించి ఉన్న ఫార్మా కంపెనీల్లో తరచూ ప్రమాదాలు జరిగి పలువురు ఉద్యోగులు, కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఔషధాల తయారీ కంపెనీల్లో మండే స్వభావం ఉండే కెమికల్స్‌ను అధికంగా వినియోగిస్తుంటారు. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే మంటలను అదుపు చేసేందుకు, ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు ఉండడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే... అచ్యుతాపురం సెజ్‌లోని జిఎంఎఫ్‌సి ల్యాబ్‌లో రియాక్టర్ పేలి ఒకరు మృతి చెందారు, నలుగురు గాయపడ్డారు. పరవాడ ఫార్మాసిటీలోని సాయినార్ కెమికల్స్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు, స్మైలెక్స్ కంపెనీలో సంభవించిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. అచ్యుతాపురం సెజ్‌లో సీడ్స్ విభాగంలో 2022 జూన్ 3న, ఆగస్టు 2న విషవాయువు లీకై 500 మందికిపైగా మహిళా ఉద్యోగులు అస్వస్థతకు గురయ్యారు. ప్రమాదాలు జరిగినప్పుడు విచారణ చేపట్టిన అధికారులు... కర్మాగారాల నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమని తేలుస్తున్నారుగానీ కనీసం చర్యలు తీసుకోవడం లేదు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు కొద్దిపాటి ఆర్థిక సాయం అందించి చేతులు దులుపుకుంటున్నారు. విచారణ నివేదికలను బయటపెట్టడంలేదు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన భద్రతా చర్యల గురించి పట్టించుకోవడం లేదు.

మళ్లీ మోసగించేందుకే...

(మొదటి పేజీ తరువాయి)



కూల్చివేసిన చెట్లు

చంద్రబాబు స్వయంగా సంతకం చేసిన కరపత్రాన్ని జగన్ చూపుతూ... దీనిలోని ఏ ఒక్క హామీ అమలు కాలేదని ఉదాహరణలతో సహా వివరించారు. ప్రతి నగరాన్నీ హైటెక్ సిటీ చేస్తామన్నారని, మార్కాపురం, పొదిలి, ఒంగోలులో హైటెక్ సిటీలు కనిపించాయా? అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా కూడా లేదన్నారు. రాష్ట్రాన్ని సింగపూర్ చేస్తామన్నారని, ఇవేవీ అమలు చేయలేదన్నారు. ఇప్పుడు ఎన్నికలు వచ్చేసరికి కొత్తకొత్త మేనిఫెస్టోలతో మళ్లీ ఈ ముగ్గురూ కూటమిగా మోసం చేసేందుకు వస్తున్నారని విమర్శించారు. చంద్రబాబును నమ్మడం అంటే పులి నోట్లో తలపెట్టడమేనన్నారు. నిస్వార్థంగా సేవ చేస్తున్న వలంటీర్లను నీచమైన మాటలు అనడం శోచనీయమన్నారు. వైసిపి ప్రభుత్వం వల్ల తనకు మేలు జరిగిందని చెప్పిన గీతాంజలిని సోషల్ మీడియాలో టిడిపి వారు వేధించి ఆమె ప్రాణాలు తీశారని విమర్శించారు. ప్రజలను మోసగించిన వారి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు సిద్ధమా? అని కోరుతూ.. సిద్ధమైతే సెల్‌ఫోన్ తీసి టార్చ్‌లైట్ వెలిగించాలని కోరారు. ఈ ఎన్నికల్లో మోసం చేసేవాళ్లకు గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం పోటీ చేస్తున్న అభ్యర్థులను పరిచయం చేశారు.

జగన్ చేతికి స్వల్ప గాయం

మేమంతా సిద్ధం బస్సు యాత్ర సందర్భంగా ఆదివారం ఉదయం 11.30 గంటల సమయంలో పిసిపల్లి మండలం పాలేటిగంగమ్మ గుడి ప్రాంతంలోకి బస్సు యాత్ర ప్రవేశించింది. గంగమ్మ గుడి సమీపంలో ప్రజల సమస్యలు తెలుసుకొనేందుకు ముఖ్యమంత్రి జగన్ ప్రయత్నించారు. ఈ సందర్భంగా మహిళలు జగన్‌తో చేతులు కలిపేందుకు నెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో మహిళల గోర్లు తగిలి జగన్ చేతికి స్వల్పగాయమైంది.

పచ్చని చెట్లు నరికివేత: అడ్డుకున్న స్థానికులు

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా కనిగిరిలో ఆదివారం మేమంతా సిద్ధం బస్సు యాత్ర రోడ్ షో జరుగుతున్న నేపథ్యంలో సచివాలయ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లను తొలగించారు. కనిగిరిలోని శంఖవరం, ఆర్‌టిసి డిపో, జీవు సెంటర్లో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న నీడనిచ్చే చెట్లను తొలగిస్తుండడంతో స్థానికులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. బస్సు యాత్రకు చెట్లు ఎలాంటి ఇబ్బందులు కాకపోయినా రోడ్లకు ఇరువైపులా నీడనిచ్చే పచ్చని వేప, చింత చెట్లను తొలగించడం ఏంటని నిలదీశారు. కొన్నిచోట్ల సచివాలయ సిబ్బందిని స్థానికులు అడ్డుకున్నారు. అప్పటికే సచివాలయ సిబ్బంది ఐదు చెట్లను నరికివేశారు. మరో 20 చెట్ల కొమ్మలను తొలగించారు. ఎక్కువ మంది చేరి నిలదీయడంతో సిబ్బంది వెనుదిరిగారు.

సిఎం రమేష్‌కు నోటీసులు

ప్రజాశక్తి - చోడవరం (అనకాపల్లి)

తమ విధులకు ఆటంకం కలిగించారంటూ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ (డిఆర్ఐ) అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బిజెపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి సిఎం రమేష్‌కు పోలీసులు శనివారం రాత్రి 41ఎ నోటీసులు అందజేశారు. ఈ నెల 9న చోడవరం పోలీస్‌స్టేషన్‌లో జరగబోయే విచారణకు విధిగా హాజరు కావాలని వాటిలో పేర్కొన్నారు. ఈ నెల 4న చోడవరం మండలంలోని గాంధీ గ్రామంలో ఉన్న బుచ్చిబాబు ట్రేడర్స్ టైల్స్ దుకాణంపై డిఆర్ఐ అధికారులు దాడులు నిర్వహిస్తున్న సమయంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెఎస్ఎన్ఎస్ రాజు, బిజెపి ఎంపి అభ్యర్థి సిఎం రమేష్ హడావుడి చేసి అధికారుల ఫైల్స్‌ను లాక్కున్న విషయం తెలిసిందే. దీనిపై అధికారుల ఫిర్యాదు మేరకు సిఎం రమేష్‌కు నోటీసులు అందజేసినట్లు సిఐ బి శ్రీనివాసరావు తెలిపారు.

15 నుంచి చేపల వేట నిషేధం

ప్రజాశక్తి-బాపట్ల

సముద్ర జలాల్లో ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేట నిషేధం అమలు చేస్తున్నట్లు బాపట్ల మత్స్యశాఖ అధికారి రవీంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. యాంత్రిక పడవలు, మేకనైజ్డ్, మోటారు బోట్ల ద్వారా జరిగే అన్ని రకాల చేపల వేటను 61 రోజుల పాటు ప్రభుత్వం నిషేధించిందని పేర్కొన్నారు. చేపల పునరుత్పత్తి కాలంలో తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం ద్వారా మత్స్య సంపదను మరింత పెంపొందించేందుకు ఈ నిషేధం విధించినట్లు తెలిపారు. ఈ మేరకు మత్స్యకారులు సహకరించాలని కోరారు. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించిన బోట్ల యజమానులకు ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టాన్ని అనుసరించి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే బోట్లు, మత్స్య సంపదను స్వాధీనం చేసుకుని జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. చేపలవేట నిషేధం సక్రమంగా అమలయ్యేందుకు మత్స్య శాఖ, కోస్ట్ గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ నిర్వహిస్తారని తెలిపారు.



శ్రీవారి ఆలయం ఎదుట రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి

శ్రీవారిని దర్శించుకున్న జవహర్ రెడ్డి

ప్రజాశక్తి- తిరుమల:

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి ఆదివారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిని సందర్శించారు. టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి అన్నదమ్ములు మృతి

ప్రజాశక్తి- సోమల (చిత్తూరు జిల్లా)

ఈతకు వెళ్లి అన్నదమ్ములు మృతి చెందిన సంఘటన చిత్తూరు జిల్లా సదుం మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సదుం మండలం చెరుకువారిపల్లికి చెందిన శరవణ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆయన కుమారులు అభినాష్ (14) అశ్విన్ (13) ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిది, ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో మధ్యాహ్నం సదుం నడిగడ్డ మార్గమధ్యంలోని రఘుపతి నాయన చెరువుకు వెళ్లారు. చెరువులో దిగి ఈత రాకపోవడంతో మునిగిపోయారు. గమనించిన స్థానికులు వాళ్లను బయటకు తీశారు. అప్పటికే వారిద్దరూ మృతి చెందారు. ఎస్ఐ మారుతి పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మిమ్స్ ఆందోళనలో పది మంది అరెస్టు

- ఏడుగురికి రిమాండ్
- అరెస్టయిన వారిలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, నెల్లిమర్ల

సమస్యలు పరిష్కరించాలని 67 రోజులుగా నిరసన చేస్తున్న మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు, సిఐటియు నాయకులపై మిమ్స్ యాజమాన్యం పోలీసులను ఉపయోగించి నిర్బంధానికి, అరెస్టులకు పాల్పడుతోంది. శనివారానికి 16 మంది సిఐటియు నాయకులను, మిమ్స్ ఉద్యోగులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు.. తాజాగా ఆదివారం మరో పది మందిని అరెస్టు చేశారు. వారిలో ఏడుగురిని రిమాండ్ చేశారు.

విజయనగరం జిల్లా నెల్లిమర్లలో సిఐటియు మద్దతుతో మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు 67 రోజులుగా సమ్మె చేస్తున్నారు. సమ్మె శిబిరాన్ని సందర్శించేందుకు ఆదివారం సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ వచ్చారు. అక్కడ నాయకులను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు.



డెంకాడ పోలీసు స్టేషన్‌లో సుబ్బరావమ్మ, తమ్మినేని, లక్ష్మి

పోలీసుల చర్యకు వ్యతిరేకంగా సుబ్బరావమ్మ రహదారికి అడ్డంగా పడుకుని నిరసన తెలిపారు. పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి, డెంకాడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం శిబిరం వద్ద ఉన్న ఉద్యోగులు విసినిగిరి అప్పలనాయుడు, మహంతి నాగభూషణరావు, గొండెల రమణమూర్తి, రాంబార్కి రమణ, బెల్లాన రాజాబాబు, పతివాడ శ్రీను, కొసర లక్ష్మి.. మొత్తం ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీంతో రిమాండ్‌కు తరలించిన వారి సంఖ్య 23కు చేరింది. అరెస్టయిన సుబ్బరావమ్మ, తమ్మినేని, లక్ష్మిని సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ అక్రమ కేసులను రద్దు చేసి, అరెస్ట్ చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం, ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ధర్నా నిర్వహిస్తున్న ఉపాధి కార్మికులు

ఉపాధి కార్మికుల వేతనం రూ.600కు పెంచాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు (కృష్ణాజిల్లా)

ఉపాధి హామీ పని దినాలు 200 రోజులకు, కార్మికులకు రూ.600కు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉపాధి కార్మికులు ధర్నా చేశారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలంలోని వడ్లమన్నాడు గ్రామ శివారు నక్కలపాలెంలో జరిగిన ఈ ధర్నాలో సంఘం నాయకులు బివి శ్రీనివాసరావు మాట్లాడుతూ పెరిగిన ధరలు వంద శాతం ఉంటే ఉపాధి కార్మికులకు కేంద్ర ప్రభుత్వం పది శాతమే కూలి పెంచడం దారుణమన్నారు.

దీనిని బట్టి మోడీకి ఉపాధి కార్మికుల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోందని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్లో నిధులు రూ. రెండు లక్షల కోట్లకు పెంచాలని, ఉపాధి కార్మికులకు మనిషికి 100 రోజుల నుంచి 200 రోజులు పనిదినాలు చూపించే వరకు పోరాడాలని కోరారు. నాయకులు కటికల యాకోబు మాట్లాడుతూ మేస్త్రీ వ్యవస్థని నిర్వీర్యం చేసి ఉపాధి వ్యవస్థని దెబ్బకొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించటం దారుణమన్నారు. మేస్త్రీకి జీతం రూ. పది వేలు ఇవ్వాలని, లేదా అదనంగా కార్మికుడుకి రూ.5 ఇవ్వాలని కోరారు. కౌలు రైతు సంఘం గ్రామ అధ్యక్షులు మాదాసు సుబ్బయ్య మాట్లాడుతూ వేసవిలో అదనపు వేతనం, మజ్జిగ, నీరు, టెంట్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కమ్మగంటి భాస్కరరావు, కె కిషోర్, కె బసవయ్య, కె వేణు, జంగం స్వప్న, జంగం బాలు, జంగం మేరీ రాధ, మెండు స్వాతి, గొంతుపూడి జ్యోతి, చిరువోలు సంపూర్ణ, చిరువోలు సుధ పాల్గొన్నారు.

ఎన్నికల తరువాత బిజెపిలో టిడిపి విలీనం

- మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్ (పల్నాడు జిల్లా)

సార్వత్రిక ఎన్నికల అనంతరం చంద్రబాబు జైలుకెళ్తారని, బిజెపిలో టిడిపిని వీలీనం చేస్తారని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వైసిపి కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. పోలవరాన్ని ఎటిఎంలా చంద్రబాబు వాడుకోవడం వల్లే అది పూర్తి కాలేదన్నారు. పోలవరంపై చర్చకు సిద్ధమా? అని చంద్రబాబుకు సవాలు విసిరారు. గతంలో చంద్రబాబును కన్నా లక్ష్మీనారాయణ నానా తిట్లు తిట్టలేదా? అని ప్రశ్నించారు.

అన్ని పార్టీలకూ కన్నాలు వేసి వచ్చిన కన్నా లక్ష్మీనారాయణ ఏదో ఒకనాడు టిడిపికి కూడా కన్నం వేస్తారని ఎద్దేవా చేశారు. మేము వదిలేస్తేనే లావు శ్రీకృష్ణదేవరాయలు, జంగా కృష్ణమూర్తి మీ చంకనెక్కారని అన్నారు. పవన్‌కల్యాణ్ రెండు రోజులు ప్రచారం చేసి ఐదు రోజులు జ్వరమంటూ పడుకుంటున్నారని, తాను పండగలకు సంతోషంతో డ్యాన్సులు వేస్తే.. పవన్ కల్యాణ్ డబ్బులు తీసుకుని డ్యాన్స్‌లు వేస్తున్నారని అన్నారు. యువగళం పేరుతో రాష్ట్రమంతా తిరిగిన లోకేష్ ఇప్పుడు మంగళగిరికే పరిమితమయ్యారని విమర్శించారు.

జగన్‌రెడ్డి కుంభకర్ణుడు

- 'వివేకా' హంతకులు యథేచ్ఛగా బయట తిరుగుతున్నారు
- నిందితులు చట్టసభల్లోకి వెళ్లకూడదనే నేను నిలబడ్డాను
- మూడో రోజు బస్సు యాత్రలో వైఎస్ షర్మిల



కమలాపురంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-కమలాపురం (వైఎస్ఆర్ జిల్లా)

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కుంభకర్ణుడని, నాలుగున్నరేళ్లు నిద్రపోయి ఎన్నికలకు ఆరు నెలల ముందు నిద్రలేచారని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. వైఎస్ఆర్ జిల్లా కమలాపురం నియోజకవర్గంలో ఆదివారంనాడు మూడో రోజు బస్సుయాత్ర కొనసాగింది. నియోజకవర్గంలోని కమలాపురం, పెండ్లిమర్రి, వీఎన్ పల్లె, సికెదిన్నె, చెన్నూరు మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ రాష్ట్రం అక్రమాలు, దౌర్జన్యాలు, హత్యలు, దోపిడీలమయంగా మారిందన్నారు. ఇసుక, మైనింగ్ మాఫియా రాజ్యమేలుతోందని విమర్శించారు. కడప స్టీల్ ప్లాంట్ వైఎస్ఆర్ కల అని అన్నారు. జగన్ శంకుస్థాపనలు చేశారే తప్ప ప్రాజెక్టు ముందుకు కదల్లేదని పేర్కొన్నారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగి ఐదేళ్లయినా ఇంతవరకు హంతకులకు శిక్ష పడలేదని వాపోయారు. హత్యచేసిన వాళ్లు అధికారం అడ్డు పెట్టుకుని దర్జాగా తిరుగుతున్నారని, అన్ని ఆధారులూ ఉన్న చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అవినాష్‌రెడ్డే హంతకుడని సిబిఐ చెప్పిందని, అలాంటి వ్యక్తికే జగన్ మళ్లీ టికెట్ ఇచ్చారని పేర్కొన్నారు. ఇది హత్యా రాజకీయాలను ప్రోత్సహించినట్లేనని అన్నారు. నిందితులు చట్టసభల్లోకి వెళ్లకూడదనే తాను ఎంపిగా పోటీ చేస్తున్నానని ఆమె తెలిపారు. ఒక వైపు ధర్మం, మరో వైపు డబ్బు ఉందని, ప్రజలు ఎవరిని గెలిపించాలో ఆలోచన చేయాలని అన్నారు.

ఆదిమూలం శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించిన షర్మిల

పెండ్లిమర్రిమండలం యాదవపురం గ్రామంలో వారం రోజుల కిందట ఆదిమూలం శ్రీనివాస్‌యాదవ్ హత్యకు గురికావడంతో ఆయన కుటుంబాన్ని వైఎస్ షర్మిల పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. శ్రీనివాస్‌యాదవ్‌ను అత్యంత దారుణంగా కాల్చి హత్య చేశారని పేర్కొన్నారు. నిందితులు ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ముఖ్య అనుచరులేనని ఆరోపించారు.

షర్మిలను ఎంపిగా చూడాలనేది వివేకా కోరిక : సునీత

షర్మిలను ఎంపిగా చూడాలని తన తండ్రి కోరిక వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత అన్నారు. షర్మిలతో కలిసి బస్సుయాత్రలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పక్కా స్కెచ్‌తోనే తన తండ్రిని హత్య చేశారని ఆరోపించారు. వివేకా హత్య విషయంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాటలూ విడ్డూరంగా ఉన్నాయని పేర్కొన్నారు.

సువిధ పోర్టల్‌తో
ఎన్నికల నిర్వహణలో పారదర్శకత!

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల ప్రవర్తనా నియమావళి కార్యరూపం దాల్చిన 20 రోజుల్లో సువిధ పోర్టల్‌లో రాజకీయ పార్టీలు, అభ్యర్థుల నుంచి 73,379 అనుమతి అభ్యర్థనలు అందగా, వాటిలో 44,626 అభ్యర్థనలను ఎన్నికల కమిషన్ ఆమోదించింది. 11,200 అంటే 15శాతం అభ్యర్థనలను తిరస్కరించింది. మరో 10,819 దరకాస్తులు చెల్లనివి లేదా నకిలీవిగా నిర్ధారించింది. ఈ నెల 7నాటికి అందిన సమాచారం మేరకు మిగిలిన దరకాస్తులు పరిశీలన దశలో ఉన్నట్లు ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఇప్పటి వరకు గరిష్టంగా తమిళనాడు నుంచి 23,239, పశ్చిమ బెంగాల్ నుంచి 11,976, మధ్యప్రదేశ్ నుంచి 10,636 అభ్యర్థనలు అందగా, చండీగఢ్ (17), లక్షద్వీప్ (18), మణిపూర్ (20) కనిష్టంగా దరకాస్తులు అందాయి.

సువిధ పోర్టల్ అంటే:

సువిధ పోర్టల్ (https//suvidha.eci.gov.in) ద్వారా రాజకీయపార్టీలు, అభ్యర్థులు ఎక్కడ నుంచైనా, ఎప్పుడైనా అనుమతి అభ్యర్థనలను సజావుగా సమర్పించే అవకాశం ఉంది. అదే సమయంలో ఆఫ్‌లైన్‌లో అభ్యర్థనలు సమర్పించే అవకాశాన్ని కూడా ఎన్నికల కమిషన్ కొనసాగిస్తోంది. రాష్ట్ర విభాగాల నోడల్ అధికారులచే నిర్వహించబడే పటిష్టమైన ఐటి ప్లాట్ ఫారమ్ సహకారంతో దరకాస్తులను సమర్ధవంతంగా ప్రాసెస్ చేయడానికి సువిధ పోర్టల్ వీలు కల్పిస్తుంది. సువిధ ఒక సహచర యాప్‌ను కూడా కలిగి ఉంది. దరకాస్తుదారులు తమ అభ్యర్థనల స్థితిని ట్రాక్ చేయడానికి వీలు కల్పించే ప్రక్రియకు మరింత సౌలభ్యం, పారదర్శకతను యాప్ కల్పిస్తుంది. ఈ యాప్ ఐఒఎస్, యాండ్రాయిడ్ ప్లాట్ ఫారమ్‌ల్లో అందుబాటులో ఉంది. సువిధ ప్లాట్ ఫారమ్ ఎన్నికల ప్రక్రియ సామర్థ్యాన్ని పెంపొందించడమే కాకుండా అప్లికేషన్‌ల రియల్‌టైమ్ ట్రాకింగ్, స్టేటస్ అప్‌డేట్‌లు, టైమ్ స్టాంప్ చేసిన వాటితో పాటు ఎస్ఎమ్ఎస్ ద్వారా కమ్యూనికేషన్‌ను అందించడం ద్వారా పారదర్శకతను నిర్ధారిస్తుంది. వీటితోపాటు పోర్టల్‌లో లభించే అనుమతి డేటా ఎన్నికల వ్యయాలను పరిశీలించడానికి ఉపయోగ పడుతుంది. న్యాయమైన, సమర్ధవంతమైన, పారదర్శక ఎన్నికల వాతావరణాన్ని కలిగించేందుకు, అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు అవసరమైన అనుమతులు పొందేందుకు, సమాన అవకాశాలను కల్పించేందుకు ఈ సువిధ ప్లాట్ ఫారమ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎన్నికల కమిషన్ పేర్కొంది.

ఇసికి అత్యధికంగా వచ్చిన దరకాస్తులు (రాష్ట్రాల వారీగా)

ఆంధ్రప్రదేశ్	1153
అస్సాం	2609
కర్ణాటక	2689
కేరళ	1411
మధ్యప్రదేశ్	10,636
మహారాష్ట్ర	2131
మేఘాలయ	1046
రాజస్థాన్	2052
తమిళనాడు	23,239
త్రిపుర	2844
ఉత్తరప్రదేశ్	3273
పశ్చిమ బెంగాల్	11,976
ఉత్తరాఖండ్	3273
గుజరాత్	648
తెలంగాణ	836

ఇంటింటి ప్రచారానికి ముందస్తు అనుమతా?

- సిఇసికి టిడిపి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల్లో ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీకి కూడా ముందస్తు అనుమతి తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఇచ్చిన ఆదేశాలు అభ్యంతరకరమని టిడిపి రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్ర తెలిపారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదివారం లేఖ రాశారు. ఇంటింటికి ప్రచారం, కరపత్రాల పంపిణీలపై స్పష్టత ఇవ్వాలని 10 రోజుల క్రితం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కోరినా ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదని పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ ఇంటింటి ప్రచారానికి వెళ్లిన తమ పార్టీ వారిపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు అభ్యంతరాలు తెలిపారని, దూషించారని పేర్కొన్నారు. ప్రతి రోజూ, ప్రతి గ్రామం, ప్రతి వార్డులో ప్రచారం కోసం అనుమతి తీసుకోవడం సాధ్యం కాదని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఈ తరహా ఉత్తర్వులను ఎన్నడూ ఇవ్వలేదని వివరించారు. ఈ విషయంలో రాష్ట్ర ఎన్నికల అధికారులకు తగు సూచనలు, ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

జగన్ అబద్దాలకు ప్రజలు నమ్మారు: మాల్యాద్రి

సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పే అబద్ధాలు నమ్మి మరో మోసపోవడానికి ప్రజలు అమాయకులు కాదని టిడిపి జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి అన్నారు. జగన్ తన అవలక్షణాల్ని చంద్రబాబు నాయుడుకు ఆపాదించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుపై దూషణలు, నిందలు, అబద్ధాలు తప్ప చేసిందేంటో చెప్పుకోలేని దౌర్భాగ్య స్థితిలో జగన్ ఉన్నారని అన్నారు.

యువత ఆలోచించి ఓటు వేయాలి : విజయ్‌కుమార్

రానున్న ఎన్నికల్లో యువత ఆలోచించి ఓటు హక్కును వినియోగించుకోవాలని టిడిపి అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ అన్నారు. టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్లుగా వైసిపి పాలనలో రాష్ట్రం ఎలా నాశనమయ్యిందో యువత, ప్రజలు ఆలోచించుకోవాలని చెప్పారు. ఏ ప్రభుత్వం జీవనోపాధి కల్పించిందో, పరిశ్రమలు తెచ్చిందో, ఉద్యోగ అవకాశాలు, సంపద సృష్టించిందో తెలుసుకోవాలని తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఎన్నో పరిశ్రమలు తీసుకొచ్చారని, వైసిపి ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాలేదని, ఉన్న వాటినే తరిమికొట్టిందని అన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని పేర్కొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

వామపక్ష అభ్యర్థులను గెలిపించుకుంటేనే కార్మిక రాజ్యం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రానున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి దానికి వంతపాడే టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించి వామపక్ష పార్టీల అభ్యర్థులను గెలిపించుకుంటేనే కార్మిక రాజ్యం వస్తుందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. ప్రభుత్వ విధానాలపై ట్రేడ్ యూనియన్ల వర్క్‌షాప్ సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.ఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన కర్నూలులోని కార్మిక కర్షక భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి సిహెచ్.నర్సింగరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పోరాడీ కార్మిక చట్టాలను సాధించుకున్నామని తెలపారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు ఏ ఒక్క చట్టమూ చేయకపోగా ప్రభుత్వ రంగాలన్నింటిని ప్రయివేటుపరం చేస్తున్నారని తెలిపారు. విద్యుత్తు, ట్రాన్స్‌పోర్టు రంగాల్లోని కాంట్రాక్టు ఉద్యోగులందరూ తమ హక్కుల కోసం రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేస్తున్నారని, అలాంటి వార్తలు రాకుండా మీడియాను మోడీ తన గుప్పిట్లో పెట్టుకున్నారని అన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటు వారికి అప్పగించేందుకు కనీస వేతనం ఇవ్వకుండా, నియామకాలు చేపట్టకుండా ఉన్న వారిపై పని భారం మోపుతున్నారని తెలిపారు. సిఐటియు నాయకత్వంలో పోరాటాలు చేయడం వల్లనే అంగన్‌వాడీ, ఆశ, 104, మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం తలొంచి గ్రూప్ ఆఫ్ మినిస్ట్రీస్‌ను ఏర్పాటు చేసి రాతపూర్వకంగా హామీలు ఇచ్చిందన్నారు. కార్పొరేటర్ సంస్థలకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తూ పార్లమెంటులో చట్టాలు చేస్తున్న బిజెపికి రాష్ట్రంలో ఉన్న టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు మద్దతు తెలపడం దారుణమన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వామపక్ష పార్టీలైన సిపిఎం, సిపిఐలను గెలిపించుకోవాలని కోరారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడుతూ.. కార్మిక, ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎం, సిపిఐ అభ్యర్థులకు గెలిపించాలని కోరారు. ఈ వర్క్‌షాప్‌లో సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, నంద్యాల జిల్లా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

- ఇద్దరు పాస్టర్లు మృతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ప్రమాదానికి కారణమైన లారీ... లారీ కింద చిక్కుకున్న ద్విచక్ర వాహనం.

ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఇద్దరు పాస్టర్లు దుర్మరణం చెందారు. ఈ సంఘటన పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం వీరవట్నం సమీపంలోని అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారిపై ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈపూరు మండలం గోపువారి పాలేనికి చెందిన పాస్టర్లు రావెల వెంకటేశ్వర్లు (75), మొండితోక బాలశౌరి (53) రొంపిచర్ల మండలం తురుమెళ్లలోని చర్చి ప్రార్థనలో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. వీరవట్నం వద్ద వీరి ద్విచక్ర వాహనాన్ని ఒంగోలు నుండి హైదరాబాద్ వైపు వెళుతున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ద్విచక్ర వాహనం నడుపుతున్న బాలశౌరి లారీ క్రింద పడి అక్కడికక్కడే మతి చెందగా.. తీవ్ర గాయాలపాలైన వెంకటేశ్వర్లును నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రొంపిచర్ల ఎస్ఐ కెపి రవీంద్రబాబు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

రాజధాని లేని రాష్ట్రంగా మార్చారు..!

- హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం


రాజధాని రైతులను నిలువున మోసం చేయడమే కాకుండా... రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేసిన ఘనుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో ఆయన ఆదివారం పర్యటించారు. అనంతరం తన నివాసంలో బిజెపి, జనసేన ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో హిందూపురంలో ఎన్‌డిఎ కూటమి జెండా రెపరెపలాడేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. వైసిపి ఆగడాలతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారన్నారు. ప్రతి ఓటరు ఆలోచించి ఓటు వేస్తే వైసిపి ప్రభుత్వం ఇంటికి వెళ్లక తప్పదని పేర్కొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రోత్సాహం, ఓటర్ల ఆశీర్వాదంతో త్వరలో జరగబోయే ఎన్నికల్లో మూడోసారి తాను హిందూపురం ఎమ్మెల్యేగా గెలుపొందుతానని బాలకృష్ణ ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో హిందూపురం కూటమి పార్లమెంట్ అభ్యర్థి బికె.పార్థసారథి, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

బాలశౌరి గన్‌తో బెదిరించి బి ఫారాలు లాక్కున్నారు

- నవరంగ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆరోపణ

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

మచిలీపట్నం ఎంపి, టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరుపున జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న వల్లభనేని బాలశౌరి తమను తుపాకితో బెదిరించి బి-ఫారాలు లాక్కున్నారని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డి నాగేశ్వరరావు ఆరోపించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ విజయవాడలోని హోటల్ ఐలాపురం వద్ద మాట్లాడుకుందామని శుక్రవారం రాత్రి బాలశౌరి పిలిచారని, వెళ్లిన తమను గన్‌తో బెదిరించి 10 'బి' ఫారంలు లాక్కెళ్లారని ఆరోపించారు. వీటిల్లో రెండు ఎంపి, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించినవని చెప్పారు. తమ పార్టీ ఎన్నికల గుర్తు బకెట్ వచ్చిందని, గాజుగ్లాసు బ్యాలెట్‌లా కనిపించే ఈ గుర్తు వల్ల జనసేనకు నష్టం కలుగుతుందనే దురుద్దేశంతో బెదిరిస్తున్నారని తెలిపారు. తాము పోలీస్‌స్టేషన్లోనూ, డిజిపికి బాలశౌరిపై ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్ కూడా స్పందించాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి డి వెంకటేశ్వరరావు, జి రామారావు, షేక్ బాషా, షేక్ మస్తాన్, ఎస్‌డి సయ్యద్, ఎస్‌కె గబ్బర్ పాల్గొన్నారు.



సరైన విమర్శ రానిదే సరైన సాహిత్యం రాదు..

- కొడవటిగంటి కుటుంబరావు



క్రోని ఉగాది

"ఉందిలే మంచికాలం ముందుముందునా.."
పాటందుకునే వాళ్లలో మేం లేం
గడిచిన రుతువులన్నీ గడుసు రుతువులే మాకు
ఇపుడొస్తున్న క్రోధుడు కూడా
మా వసంతుడు కాడు!
ఏ యుగారంభం నాడో కాలుజారిన కాలం
బిలియనీర్ల భవంతుల్లో దాసిగా
ఉండిపోయింది
బీదల పంచల్లో పిడికెడు బియ్యం గింజలు
పడేస్తే చాలనుకుంది!
చరిత్ర సాగిన దారిలో
కాలమెక్కడో తప్పటడుగేసింది
సంపద రాశుల్నీ అధికార కిరీటాల్నీ
కుడివైపు చేర్చి
శ్రమట పోగుల్నీ ఆకలి పేగుల్నీ
ఎడమవైపు కుదేసింది!

చెమటబట్ట కప్పుకున్న నేల కలల్ని కొల్లగొట్టి
మాటల మాయావులంతా పాలకులయ్యారు
ఆ ఏలికల్ని గుప్పిట పట్టి
చట్టంతో వ్యాపార చుట్టరికం నెరిపినోళ్ళంతా
అఖండ సంపన్నులయ్యారు
ఆనాడు గానీ ఈనాడు గానీ
అసలు ఆరుగాలం చెమటోడ్చినోళ్ళం
మేం ఎక్కడున్నామన్నదే దిక్కు లేని ప్రశ్న!

కాలం దొంగ సన్యాసి!
భ్రమల్లో నానబెట్టిన షడ్రుచుల సమ్మేళనంతో
కూటికి దేవులాడే మా ఆకలి కన్నీళ్ళను కలిపి
ఉగాది పచ్చడి చేసి మా చేతికిచ్చింది
మా నాలుకలకు ఆకలిరుచి తెలుసు తప్ప
ఆరు రుచులెప్పుడు తెలిశాయని?

ఇపుడొస్తున్నది క్రోనీ ఎన్నికల క్రోధి ఉగాది
సాఫీ దోపిడి కోసం కుర్చీల చుట్టూ మూగే
సంపన్న శక్తుల బహిరంగ సర్దుబాటు
శిఖరాలెత్తున కూడబెట్టుకునేందుకు
కొద్దిమందికి అప్పనంగా రాసిచ్చే
అక్రమాస్తుల వీలునామా!
పొద్దంతా రెక్కలు ముక్కలు చేసుకుని
లబ్దిదారులమని బొటనవేలితో ముద్రేసుకుని
వనరులన్నిటికి వాటాదారులమేనని సోయిలేక
దీనంగా బతుకులీడ్చే శతకోటి చెమట రెక్కలకు
మరోసారి ఆశపెట్టే హామీ పంచాంగం!

ఒక శాతం మర్రి చెట్లే అడవి సారమంతా నొళ్ళుకున్నాక
అరకొరగా బుగ్గిని బుక్కుతున్న వివిధ జాతుల చెట్లకు
ఇది ఆమని కాదు
ఈ అసత్యాల కోయిల గానం రుచించదు
సంపద పంపిణీలో సరైన వాటా కోరే
మా బడుగుల వసంతుడి కోసం
మా బహుజన వసంతుడి కోసం
మేం పిలుస్తాం! మేం పిలుపునిస్తాం!

– కంచరాన భుజంగరావు, 94415 89602

మళ్ళీ ఓ ఉగాది



ఈ ఉగాది కొత్తగా వుంది
బతుకు నాటిన తోటలో
వసంతాలు విరబూస్తున్నట్లు
ఆహ్లాదాన్ని వీస్తోంది
చివురులేస్తున్న కోటి ఆశలను
మత్తుగా మోసుకొస్తున్నట్లుంది
పులకింతల సోయగాలతో
శోభిస్తున్నట్లుంది
ఈ ఉగాది..
నవ సంస్కృతి సౌరభాన్ని
నిత్య నూతనంగా సాక్షాత్కరిస్తోంది
ఆద్యంతాలు లేని
కాలగర్భపు తీరాన
సుఖశాంతుల జ్యోతిలా ప్రకాశిస్తోంది
మనిషితనమనే
ఐదు స్వరాల పంచాంగాన్ని
మానవత్వపు ఆజ్ఞానుసారం ప్రవచిస్తుంది
అసమానతలు లేని అభివృద్ధి శాస్త్రాన్ని
సమ వేదాల సాక్షిగా పునర్లిఖిస్తోంది
మూఢ విశ్వాసాల జనారణ్యంలో
విజ్ఞానపు కాగడా వెలిగించి
షడ్రుచుల బతుకు పాఠాలను
బెత్తం పట్టుకొని బాధ్యతతో బోధించడానికి
మరో ఉగాది
ఉత్తమోత్తమ ఉపాధ్యాయుడిలా తరలి
వస్తోంది!
ఓ క్రోధి నామ సంవత్సరమా..
మనిషి గుండెలో
ఏ క్రోధపు ముళ్ళు మొలవకుండా
ప్రేమాప్యాయతల పచ్చదనాన్ని చిలకరించు
గతపు గాయాల అవ్యవస్థను
అధునాతన ఆలోచన ఔషధాలతో
ప్రక్షాళించేందుకు
మావి చిగురు మేసిన కోయిలవై
ఆత్మీయ మిత్రునిలా అరుదెంచు!

– సునీత గంగవరపు, 94940 84576



వడగాడ్పు గానం!

ఉషస్సులు ప్రకాశించనూ లేదు
తపస్సులు తీరం చేర్చనూ లేదు
కాల లోలకం అటూ ఇటూ
నిరంతరం కొట్టుమిట్టాడుతూ ఉంది
సొంత ప్రమేయమూ ప్రయోజనమూ లేని దేహం
అటో ఇటో తిరుగాడుతుంది
తప్పనిసరి బాధ్యతల బరువు
తిప్పలు పెట్టయినా తిప్పుతూనే ఉంది!
ఒంటరి కోయిల గాయాల గేయాల్లోని
ఆత్మ నివేదన, రోదన ఎవరికి పడుతుంది?
వడగాలి వీస్తూనే ఉంది
ఆకులు రాలుతూనే ఉన్నాయి!
చలి రంపపు కోత పెడుతుంది
భీకర వర్షం ఒంటరిగా కురిసిపోతుంది
వసంతం మాత్రం దూరపు కొండల్లోని
అదృశ్యపు దరహాసం!
పంచాంగం ఉల్లేఖిస్తుంది కానీ,
నీ వాకిలిలో ఏ మార్పూ ఉండదు
నీ మనసును ఏ వెన్నెలా తాకదు
అయినా, కాల లోలకం విసుక్కోదు విశ్రమించదు
నిన్ను చిలక్కొయ్యలా అతికించుకుని
అటూ ఇటూ తిరుగుతూనే ఉంటుంది!
ఎప్పుడు ఆగుతుందో ఎక్కడ ఆగుతుందో
దానిక్కూడా తెలియదు,
అచ్చం ఒంటరి కోయిల వడగాడ్పు గానంలా ...

– టీనా, 94901 32174

జాషువా సాంస్కృతిక వేదిక రచనల పోటీ

మేడే సందర్భాన్ని పురస్కరించుకొని జాషువా సాంస్కృతిక వేదిక వివిధ సాహిత్య ప్రక్రియల్లో రచనల పోటీ నిర్వహిస్తోంది. అభివృద్ధిలో అసమానతలు, దోపిడీ, వివక్ష, సామాజిక సంక్షోభం తదితర అంశాలను ఇతివృత్త కేంద్రంగా తీసుకొని రచయితలు తమ రచనలు పంపవచ్చు. కథలు, కవితలు, పాటలు, వ్యాసాల ప్రక్రియల్లో ఈ పోటీ ఉంటుంది. ఒక్కో విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున ఉంటాయి. ప్రతి విభాగంలోనూ రూ.వెయ్యి చొప్పున రెండు ప్రోత్సాహక బహుమతులూ ఉంటాయి. 20.4.2024 లోగా రచనలను ఈమెయిల్ ద్వారా మాత్రమే పంపించాలి. ఆ నెలాఖరుకల్లా రచనల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి, 5.5.2024 ఆదివారం విజయవాడలో జరిగే సభలో విజేతలకు బహుమతీ ప్రదానం ఉంటుంది. రచనలు తప్పకుండా యూనికోడ్లో లేదా పేజీ మేకర్లో తమ రచనలు పంపాలి. కథలు, వ్యాసాలూ ఎ4 సైజులో 4, 5 పేజీల వరకూ ఉండొచ్చు. కవితలు, పాటలకు ప్రత్యేకించి నిడివిపై నిబంధన లేనప్పటికీ– కవిత 30 పంక్తులకు అటూ ఇటూగా, పాట ఒక పల్లవి, 4 చరణాలుగా ఉంటే మంచిది. **రచనలు పంపాల్సిన మెయిల్ ఐడి : sramikasambaralu24@gmail.com రచనలు చేరటానికి చివరి తేదీ : 20.4.2024**

తెలుగు సాహితీవనం కవితాపురస్కారాలు - 2024

తెలుగు సాహితీ వనం కవితా పురస్కారాలు –2024 కోసం నిర్వహించిన కవితల పోటీకి 160 కవితలు వచ్చాయి. నలుగురు సభ్యుల ప్రాథమిక వడపోత అనంతరం డా. ఏనుగు నరసింహారెడ్డి, డా. చెమన్ సింగ్ కవితలను పరిశీలించి, పురస్కార కవితలను ఎంపిక చేశారు. పురస్కార గ్రహీతలు : 1. చొక్కర తాతారావు – వైజాగ్ (బహురూపి), 2. డాక్టర్ కెజి వేణు – వైజాగ్ (నమ్మండి నేనూ అనాధనే), 3. మెట్టు శ్రీనివాస రెడ్డి – గుంటూరు (ఇక్కడి మనుష్యులదశ్యమయ్యారు) 4. తిరువాయిపాటి రాజగోపాల్ –తిరుపతి (ఏదీ గతి). జూలైలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగే తెలుగు సాహితీ వనం ఏడవ వార్షికోత్సవ సభలో పురస్కారాలు అందజేస్తాము.


– తెలుగు సాహితీ వనం

డాక్టర్ వి.చంద్రశేఖర రావు జయంతి సభ

డాక్టర్ వి.చంద్రశేఖర రావు జయంతి సభ 13 ఏప్రిల్ 2024 శనివారం సాయంత్రం 6 గంటలకు గుంటూరు 2/7 బ్రాడీపేట, కొరటాల భవన్లో జరుగుతుంది. కేరాఫ్ బావర్చీ కథాసంపుటి వెలువరించి తెలుగు కథకు కొత్త చేర్పును అందిస్తున్న యువ కథాకెరటం చరణ్ పరిమి ఈ ఏడాది డాక్టర్ వి.చంద్రశేఖర రావు స్మారక పురస్కారం అందుకోబోతున్నాడు. పెనుగొండ లక్ష్మీ నారాయణ అధ్యక్షత వహించే ఈ సభలో పాపినేని శివశంకర్, వాసిరెడ్డి నవీన్, సీతారాం, ఎస్.స్పందన, కందిమళ్ళ శివప్రసాద్, వి.ప్రసూన, కాట్రగడ్డ దయానంద్ పాల్గొంటారు.

13న సాహితీకిరణం ఉగాది సంబరాలు

సాహితీకిరణం ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు ఏప్రిల్13వ తేదీన గుంటూరు జిల్లాలోని పొత్తూరు సాహితీకిరణం బ్రాంచి కార్యాలయంలో జరుగుతాయి. కథలు, కవితల పోటీ విజేతలకు బహుమతి ప్రదానం, ఉగాది కవిసమ్మేళనం, కె.వి.ఎన్.ఎల్.ప్రసన్న కుమారి రచించిన 'సాహితీ సకలం' పుస్తకావిష్కరణ ఉంటాయి. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, బైస దేవదాసు, గుదిబండి వెంకటరెడ్డి, విడదల సాంబశివరావు, వి.వి.రాఘవరెడ్డి, పొత్తూరి సుబ్బారావు, తూములూరి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొంటారు.



ఎన్నికల కోయిల

ఓ తెలుగు వెలుగుల ఉగాదీ
కొత్త హంగుల రంగుల
రాజకీయ చిత్ర పటమై
కబుర్ల కుబుసాలు విప్పుతూ వస్తున్నావా?

మత్తు గమ్మత్తులు చూసావా
స్కాముల స్కీములు పండి పోయాయి
ఫోన్ ట్యాపింగ్లు మాయదారి మార్ఫింగ్లు
అన్నీ ఇక్కడే తచ్చాడుతున్నాయి
ఎన్నికల కోయిలవై కూస్తూ వస్తున్నావా?
కార్మిక కర్షక బాధల్ని గమనిస్తూ రా

వాగ్దాన తుపానును మోసుకు రాకు
మారుతున్న కండువాలతో
రాజకీయం కంపు కొడుతోంది
రాజ్యాలు పేక మేడల్లా కూలుతున్నాయి
కాస్త మానవత్వాన్ని కప్పుకుని రా!

గ్రీష్మం భగభగలను కురిపిస్తోంది
ఆశలు సొమ్మసిల్లి పోతున్నాయి
తడిలేని మన్యంలో దాహాల దీనగాథవై
మది మదినీ తడుతూ వచ్చేవూ
జల జల జలపాతంలా కదలి రా!

ఓటుకు నోటువై నల్లకోటుపై వేటువై
ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ వచ్చేవూ
విలువల వలువలూడ్చుకొని
డబ్బుల కట్టవై తగలబడుతూ వచ్చేవూ

గుండెల్లోనే నాగళ్లు నాటుకున్న
కిసానుల ఆర్తనాదమై
మళ్లీ మళ్లీ బాధల్ని ఎత్తుకు వచ్చేవూ
షడ్రుచులను మరిచి
చేదును వొళ్లంతా పులుముకు వచ్చేవూ

శ్రీ క్రోధివై సమానత్వ బోధివై రా
ఉషస్సై ఒయాసిస్సై లక్ష నక్షత్రాల వెలుగువై
తక్షణమే అక్షరాల పులుగువై
రెక్కలు విప్పుకుంటూ రా..
మార్పుల తూర్పు ముక్కవై రా..
ఉదయిస్తూ రా.. ఉజ్వలిస్తూ రా..
ఉద్యమిస్తూ రా.. ఊపిర్లూదుతూ రా..!

– డా.కటుకోఝ్వల రమేష్, 99490 83327

అరుణారుణ కవితా రణన్నినాదం

అమ్మ గర్భంలోంచి అందరూ రక్తపు చారికలతోనే పుడతారు. కానీ పెద్దయ్యాక కూడా ఆ మూలాలను మరవని మనుషులు కొందరే మిగులుతారు. అలాంటి అరుదైన మనిషి రౌతు రవి. అలాంటి అరుదైన కవిత్వం 'చెమట పూల తోట'. రౌతు రవి కవిత్వం పాట పాడినట్టు ఉంటుంది. ఎందుకంటే చెమటచుక్కలన్నీ పనిపాటలో పల్లవులే. రౌతు రవి చాలా సాధారణ కవి. కానీ అసాధారణ భావజాలానికి ప్రతినిది. అందుకే కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని నిక్కచ్చిగా, నిజాయితీగా పద విన్యాసం లేని వ్యథావిలాపాన్ని ఆవిష్కరించాడు. రవి కవిత్వమంతా అనుభవంలోంచి పుట్టిందే. అందుకే ఎక్కడా మనిషిని దాటి ఉండదు. ఈ కవిత్వం మనిషి చేరిన గమ్యం గురించి కాదు, నడిసొచ్చిన దారి గురించి.

ఉద్యమించడం తెలిసినోడు కాబట్టి కవిత్వాన్ని నిద్దురమంచం దింపి భూపాలరాగం వినిపించాడు. అక్షరాలతో అలయ్ బలయ్ చేసి కులం మతం వర్ణం జాతి ఏవీ తనకు, తన కవిత్వానికీ అంటవని ప్రకటించుకున్నాడు. ఇలాంటి కవిత్వం ఇలాంటి మనుషులు ఇప్పుడు అవసరం. మానవత్వంతో కరచాలనం చేసి, శ్రామిక జీవనంతో బంధాన్ని కలుపుకొని, ఎర్రని హృదయజెండాతో లోకానికి స్నేహ హస్తాన్ని చాస్తున్న కవిత్వం ఇది.

కాలుష్యం కన్ను గొడుతోంది /
నేల నేలంతా విషవాయువు ప్రసరణములే
బలిసిన పందులు కొన్ని /
అక్కడ కాలుష్య నియంత్రణా చట్టాలు చేస్తాయ్
బయట పొగలు సెగలు విరజిమ్మే ఫ్యాక్టరీలు /
జన జీవితాలను పచ్చ నోట్లకై బలి చేస్తాయి

... ఇలా దర్మాగ్రహం దర్శనమిస్తుందీ కవిత్వంలో. కాలుష్యం చేసే విలయానికీ దానికి అడ్డుకట్టలు వేయలేక విలువల వలువలిప్పుతున్న రాజ్యానికీ అక్షర చురకలు వేస్తాడు. అబద్ధపు ఆయుధాలతో యుద్దాలు చేస్తున్న మతవాదుల దుర్నీతికి పలాయనం పరిచయం చేసి, గాలి నీరు లాంటి మౌలిక జీవన అవసరాలకు విఘాతం చేసే కురూప స్వరూపాల మీద కవితాశరాన్ని ఎక్కుపెడతాడు. మౌనాన్ని వీడి ప్రశ్నల ప్రవాహంతో జ్ఞానజ్వాలలు సృష్టించమంటాడు.

ఇది ఖచ్చితంగా ప్రజా కవిత్వం. ప్రతి అక్షరం సాటి మనిషి బాగుకోసం తపిస్తుంది. సమసమాజాన్ని కలగంటూ వెన్నెలలు కురిసే రోజుల కోసం నిరీక్షణా రాగాలు ఆలపిస్తుంది. మతం మబ్బులు చెదరగొట్టి అజ్ఞానాన్ని ఆవిరి చేసే జ్ఞానభానుడ్ని ఆవాహనం చేస్తుంది. రాజ్యహింసా యుద్ధంలో చిక్కి వక్కిపోయిన నిజాయితీని తట్టి లేపడానికి అగ్నికణమై మెరుస్తుంది. అరుణతారల అమరత్వాన్ని జైలు గోడల గొంతులోంచి పలికిస్తుంది. ఇది నిన్నటి గురించి చెబుతున్న రేపటి కవిత్వం. రేపటిని ఇప్పుడే కలగంటున్న నిజమైన కవిత్వం.

మానవజాతి చరిత్ర సమస్తం /
రక్తసిక్తమైనందుకు కుమిలిపోతూ... /
శాంతి గీతాన్ని ధరణి నలుమూలలకు /
మోసుకుపోయే రణనిన్నాదమే పుస్తకం!

సూర్యుని వెలుగుల రూపమై /
చీకటిదారుల శాపమై /
మనందరినీ నడిపించే శాస్త్రీయ దారి దీపమే పుస్తకం

అధ్యయనానికి, తద్వారా సంక్రమించే జ్ఞానానికి పుస్తకం మూల కారణమని కవి రవి ఉద్ఘాటిస్తాడు. అల్లకల్లోల వర్షం చల్లబడ్డాక వీచే ఓదార్పు గాలులతో పుస్తకాన్ని పోల్చుతాడు. అక్షరంలో మనిషి చరిత్ర, అస్తిత్వం, నిన్నటి అనుభవం అన్నీ దాగి ఉంటాయన్న సత్యాన్ని మరోసారి నిక్కచ్చిగా చెప్పే కవితా వాక్యాలివి.


మంచి కవిత రాయడం, మంచి పుస్తకం చదవడం, మంచి మిత్రుడ్ని కలవడం, కొత్త ప్రాంతాన్ని దర్శించడం, కవులతో కరచాలనం చేయడం కన్నా గొప్పగా బతికే క్షణాలేమీ లేవని తనమాటలుగా చెబుతున్నా ఇష్టమైన పనులు చేయడం కన్నా గొప్ప జీవితం ఉండవని లోకానికి సందేశం ఇస్తున్నట్టు అనిపిస్తుంది. అడ్డగోలు ఆలోచనలతో కృత్రిమంగా సాగే జీవనయానానికి అశాంతి గమ్యాలే చివరి మజిలీలవుతాయి. కళాత్మక మొక్కలను బతుకుదారికిరువైపులా నాటుకోలేకపోతే నడకంతా దిగులు ఎండలు కురుస్తూనే ఉంటాయి, గమ్యాలు అసంపూర్ణంగా తయారవుతాయి.

రైతుకు జైకొట్టనోడు నిజానికి /
అన్నానికి బదులు పచ్చనోట్లనే / బుక్కి చావాలి

ఎంత ధర్మాగ్రహం ప్రజ్వలిస్తుందీ కవిత్వంలో. రాజ్యం రైతుని చిన్నచూపు చూస్తుంటే పేద కర్షకుడి కన్నీటి ప్రళయంలో అచేతనపు అధికారాన్ని కొట్టుకుపొమ్మని శపిస్తాడు ఈ వాక్యాలతో. అన్నంపెట్టే శ్రామికవర్గపు అగచాట్లు ప్రపంచపు అగచాట్లు, వారి చెమట చుక్కలు మన ఆకలి దప్పులు తీర్చే అన్నపుముద్దలు. వారి కష్టం మనందరి కష్టం కాకపోయిన రోజే సమాజపు మూకుమ్మడి మరణం అని తీర్మానిస్తాడు తన కవితా వేడితో.

నా ప్రశ్నకు నీ సమాధానం లాఠీయే అయితే /
విరిగిన నా పాదాల నుండి విరజిమ్మిన నెత్తుటి ధారలు కవితాక్షర పాదాలై నిప్పు సెగలను పుట్టిస్తాయి /
నీలో భయాన్ని రెట్టిస్తాయి
నా ప్రశ్నకు నీ జవాబును తూటానే చేస్తే /
చీలిన నా గుండె ఆర్తారావాల్లోంచి /
ఆకాశపుటెత్తుకెగసే పోరు పాటలు హొూరెత్తు కెరటాలై /
నిన్ను జల సమాధిని చేస్తాయి/ నా ప్రశ్నకు నీ బదులు చివరాస్త్రంగా ఉరి త్రాడునే పేనితే /విప్లవించిన జన చైతన్యం పూనిన నేను / బతుకు ధన్యంగా అరుణారుణ రణన్నినాదాన్నై / కొయ్యకు ఉయ్యాలూగుతాను/ నలు దిక్కులు పిక్కటిల్లే / నా బలిదాన ప్రతిధ్వనులకు / మీ దోపిడీ కోటలు బీటలు వారుతాయి.

.... ఇలాంటి కవితా ఝూంఝూమారుతాన్ని సృజించగల మన కాలపు కవి రౌతు రవి. అక్షరాల్లో అరుణ పతాకపు రెపరెపల్ని నింపి కృషీవలుడి తరపున సమరభేరి మోగిస్తూ జనచైతన్యాన్ని స్వప్నించే కవితారణన్నినాదం ఇది. విప్లవం అంటే మార్పు అనే అర్థం నీకూ నాకూ అర్థం అయినంత వరకు ఇది విప్లవ కవిత్వమే. కళ్లముందు అన్యాయం జరిగితే ఆపాలనే ఆలోచన నీకు రావడమే విప్లవం. నీతికోసం నీ జాతి అగచాట్లు కనుమరుగు చేయడం కోసం నువ్వు పిడికిలెత్తి నాలుగు రోడ్ల కూడలిలో నిలబడగలగడమే విప్లవం. నీ ఇంట్లో, నీ ఇంటి పక్కన, నీ వీధి చివర్న, నీ ఊరి చివర్న కూడా నీలాంటి మనిషే ఉంటాడని, కులం మతం వర్ణం వాడికి అంటగట్టకూడదని తెలియజెప్పే సామాజిక ఎరుక విప్లవం. ఇవన్నీ చేస్తుంది కాబట్టే ఇది విప్లవ కవిత్వం.



రైతు వసంతాన్ని కాంక్షించే కవిత్వం ఇది. ఆకు పచ్చని చెట్ల చివర్న ఎర్రజెండాలు కట్టి ఫలాలు దొంగలు ఎత్తుకుపోకుండా కాపుగాసే కవిత్వం ఇది. నైరుతీ రుతు పవనాలని రైతు పాదాల నెత్తుటి చారికల్లోంచి పారించే కవిత్వం ఇది. అన్యాయపు అధికార అనల్ప ద్రోణికి రైతుల గుండె చప్పుళ్ళు వినిపించే కవిత్వం ఇది. మెతుకు ముద్దలు కడుపుకు తినే మానవాళి మొత్తానికీ పంట దండ్రుల కడుపుకోతను పరిచయం చేసే కవిత్వం ఇది.

ఇది కలుపు తీసే అక్కల అరచేతుల్లోంచి పుట్టింది, నాట్లేసే పెద్దమ్మల పాటల్లోంచి పుట్టింది, కుప్పలు నూర్చే చెల్లెమ్మల పాద చెలిమల్లోంచి పుట్టిందీ కవిత్వం.


మీరు కూడా రుధిరవర్ణం పులుముకోండి /
భూమిపై పోరుమొక్కలై మొలవండి /
నింగీనేలా ఎర్రబారేలా చేయండి

.. ఇలా నినాదమై మ్రోగుతాడు ఈ కవితా వాక్యాలలో కవి. కారుమబ్బుల్లోంచి కణకణ మండే తుఫాను చినుకుల్లాంటి పదాల్ని పెదాలనించి వినిపించి చైతన్యపు వరదలు పారిస్తాడు.

అరుణాక్షరాలను తనువంతా నింపుకొని సమాజ శ్రేయస్సును మనసులోకి ఒంపుకొని కవితా గానం చేస్తున్నాడు రౌతు రవి, ఇవి చాలా సాధారణ అక్షరాలే కానీ వాటికి సమాజంలోంచి తీసిన ఎరుపు రంగు అద్ది అందంగా మారుస్తాడు కవి రవి. అందమైన లోకాన్ని కలగంటూ కవితాక్షర ప్రయాణం చేసి మంచి అనుభవాన్ని మనకి కానుకగా ఇస్తాడు. సాఫీగా సాగిపోయే సమరభేరీ కవిత్వం ఇది. మీరూ కనండి. వినండి. వీరోచిత గానం చేయండి!

– గౌతమ్ లింగా
+ 27 630255994

సామాజిక దృష్టితో కృష్ణావిష్కరణ



కేంద్ర సాహిత్య అకాడమీ ప్రస్తుత అధ్యక్షులు మాధవ్ కౌశిక్ ప్రఖ్యాతి గాంచిన హిందీ కవి. ఈయన కవిత్వంతో పాటు కథలు, నవలలు, గజల్స్ లాంటి ప్రక్రియల్లో నిష్ణాతులు. 50కి పైగా పుస్తకాలు వెలువరించారు. సచ్ లిఖ్నా ఆసాన్ నహీ, కరవట్ వక్, బదల్న హై, నయీ ఉమీద్ కే దునియా, సునో రాధికా లాంటి కవితా సంపుటులు; మేరీ చునిందా కహానియా లాంటి కథా సంపుటులు; పానీ పర్ తెహరీర్ నయీ లాంటి గజల్ సంపుటాలు ప్రచురించారు. అఖిల భారతీయ బాలరాజ్ సాహిని అవార్డు, శిరోమణి సాహిత్య కార్ సమ్మాన్, మహాకవి సూరదాస్ సమ్మాన్ లాంటి అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డులు పొందారు. హిందీలో ప్రసిద్ధిగాంచిన ఆయన 'సునో రాధిక' కావ్యాన్ని ప్రముఖ కవి, జర్నలిస్టు కృష్ణుడు 'రాధికా, ఆలకించు' పేరుతో తెలుగులోకి అనువాదం చేశారు. ఈ కావ్యంలో కృష్ణుని సామాజిక దృక్పథాన్ని కవి వ్యక్తికరించే ప్రయత్నం చేశాడు. ప్రజా పాలనలో వారి సుఖసంతోషాల్లో మునిగితేలిన శ్రీ కృష్ణుడు, కొంతకాలం తర్వాత ఏకాంతంగా కూర్చొని తన జీవితంలోని అనేక అనేక ఘటనల నేపథ్యాన్ని తలపోస్తూ, తన ఆలోచనలను రాధికకు చెప్పే క్రమం ఈ కావ్యంలో కనబడుతుంది.

"ఇవాళ / ఎన్నో ఏళ్ల తర్వాత
జీవితంలోని ఈ అనంత ప్రవాహాన్ని
చూసి, భరించి / దాని వేగాన్ని అర్థం చేసుకొని
దాని మనసును గ్రహించి
దాని ముగింపును తెలుసుకున్న తర్వాత కూడా
ఇంతకు ముందులా/ నేనెందుకు భావుకుడినయ్యానో తెలియదు" అంటూ ప్రారంభించి, "అన్ని చమత్కారాలు తెలుసు
ఏదీ లేదు, ఏది ఉండదు
ప్రజల ప్రేమ, ఆప్యాయత తప్ప
వారి విశ్వాసం, ప్రేమ తప్ప
వారి భక్తి, ప్రేమల ముందు
నేనెప్పుడూ తలవంచుతాను" అంటాడు. బహుశా ఈ కృష్ణ ప్రేమ తెలియడం వల్ల కాబోలు రాధా, మీరాబాయి లాంటి వాళు కృష్ణుడిని అమితంగా ప్రేమించారు. ఈ సారాన్ని గ్రహించిన కవి కృష్ణుని మాటలుగా,

"నీ నుండి విడిపోయిన తర్వాత
ఎంతో బాధపడ్డాను రాధా
ఎంతో ఎంతో బాధపడ్డాను
ఎంతో ఎంతో రోదించాను
మరణాంతం వరకు
బాధలతో పోరాడాను
కానీ నువ్వు తప్ప కన్నీళ్ల
ఎవరూ చూడలేదు" అని పలికించాడు.

మాధవ్ కౌశిక్ కావ్యమంతటా కృష్ణునితో రాధిక పట్ల తన ప్రేమ భావనలు పలికిస్తూనే సామాజికాంశాల పట్ల తన కర్తవ్యాన్ని, ఆలోచనలను వ్యక్తం చేయిస్తాడు.

"రాజకీయం కూడా
రెండు ముఖాల విచిత్రం
ఒక నోటితో అవును అని
అదే క్షణంలో మరో నోటితో
కాదు అంటూ మొఖం చెల్లనివ్వదు".

"రాజభవనంలో వధువులా
మెరుస్తున్న నీలిరంగు ప్రకాశం వెనుక
కుటిలత్వపు విషపంజాలు
ధరించిన రాక్షసులు
మానవుల వేషంలో
చిరునవ్వు నవ్వుతున్నారు
వారిని ఎదుర్కోవడం, పోరాడడం
కాళీయమర్దనం కంటే, అతి కష్టం" అని పాలనా విషయాల పట్ల కృష్ణుడికి ఉన్న గాఢపూర్వక పరిణితిని ఈ వాక్యాలు వ్యక్తం చేస్తాయి. కవికి స్త్రీల పట్ల ఉన్న గౌరవాన్ని కృష్ణుని మాటల ద్వారా పలికిస్తూ,

"పాపం ద్రుపద పుత్రికి
ఏమి జరిగిందో అర్థం కాలేదా
మనిషి దోపిడీ, అణిచివేత పరాకాష్టకు
వారి అంతిమ కాటుకూ
ప్రతీకారానికి
స్త్రీ జాతి మాత్రమే
చివరి సాధనం ఎందుకవుతుంది" అంటూ
"ద్రౌపది హృదయ విదారక అరుపులు
గుర్తుకు వచ్చినప్పుడల్లా
ఒళ్లంతా వణికి పోతుంది
ఆమె ఆర్తనాదాలు దశదిశలా
అసంఖ్యాక తలుపుల్ని
తడుపుతూనే ఉన్నాయి
ఇప్పటికీ, మన పౌరుషాన్ని సవాలు చేస్తూ
మనం జీవించే అధికారాన్ని / ప్రశ్నిస్తూ ప్రతిధ్వనిస్తున్నాయి"
... ఈ వాక్యాలు సర్వకాల సర్వావస్థల్లో స్త్రీ జాతి పట్ల ఆర్తిని ప్రకటిస్తాయి.

ఈ కావ్యం గురించి మాట్లాడడం అంటే కృష్ణుని దృక్పథంలో వర్తమాన రాజకీయ సామాజికాంశాల పట్ల మన బాధ్యతను గుర్తు చేసుకోవడమే. మాధవ కౌశిక్ కవితా నిర్మాణంలో ఒక విధమైన సంవిధానం పాటించాడు. తెలుగులో మనకు పరిచయం చేసిన కృష్ణుడు చాలా సంవత్సరాలుగా ఢిల్లీలో ఉండడం వల్ల కావచ్చు, లేదా హిందీ పట్ల ఆయనకున్న అభినివేశం వల్ల కావచ్చు, హిందీ కావ్యానికి ఇది అనువాదం అనే భావన ఎక్కడా కలగని విధంగా అనువాదం చేశారు. ఉత్తరాదిన అనేక విశ్వవిద్యాలయాలు ఈ కావ్యాన్ని పాఠ్యగ్రంథంగా ఎంపిక చేశాయి. "స్వగత కథనశైలిలో రచించిన ఈ కావ్యంలో శ్రీకృష్ణుడి అద్వితీయమైన సామాజిక దృష్టిని, ఆయన మౌలిక భావజాలాన్ని కొంచెమైనా తెలియజేయ గలిగానని బుద్ధి జీవులు భావిస్తే నన్ను నేను అదృష్టవంతుడిగా భావిస్తాను" అన్న కవి వాక్యాలతో నేను ఏకీభవిస్తున్నాను. ఈ పుస్తకాన్ని ఎమెస్కో ప్రచురించింది.

– బండ్ల మాధవరావు

మళ్లీ మోడీ వస్తే... ప్రజాస్వామ్యమే ఉండదు

- ఎన్నికల వేళ ప్రతిపక్షాలే లక్ష్యంగా దాడులు
- దేశాన్ని హిందూత్వ రాష్ట్రంగా మార్చే ప్రయత్నం
- వైస్రాయ్‌ల పాత్ర పోషిస్తున్న గవర్నర్లు
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్ కరత్
- మదురైలో పార్టీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం



మదురైలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తున్న ప్రకాశ్ కరత్

మదురై : కేంద్రంలో నరేంద్ర మోడీ, బిజెపి తిరిగి అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యమే ఉండదని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్ కరత్ చెప్పారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయని ఆయన అన్నారు. తమిళనాడులోని మదురై లోక్‌సభ నియోజకవర్గం నుండి పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెంకటేశన్‌కు మద్దతుగా శనివారం జరిగిన బహిరంగ సభలో కరత్ ప్రసంగించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష నేతలను బిజెపి లక్ష్యంగా ఎంచుకున్నదని ఆయన ఆరోపించారు. అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సొరేన్‌ను అరెస్ట్ చేశారని, ఓ వైపు ఎన్నికల ప్రచారం జరుగుతుంటే మరోవైపు ప్రతిపక్ష నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు చేస్తూనే ఉన్నాయని విమర్శించారు.

ఇవేం చర్యలు?

ప్రతిపక్షాలతో బిజెపి ప్రజాస్వామిక పద్ధతిలో పోరాడడం లేదని, వాటిని అణచివేస్తోందని కరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ ఖాతాలను ఆదాయపన్ను శాఖ స్తంభింపజేసిందని, ఆ పార్టీకి నోటీసులు జారీ చేసిందని గుర్తు చేశారు. కేరళలోని త్రిస్సూర్ జిల్లాలో సిపిఎం బ్యాంక్ ఖాతాను సైతం ఐటీ శాఖ ఫ్రీజ్ చేసిందని చెప్పారు. ఇడి, సిబిఐ, ఐటి వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా ప్రతిపక్షాలను అణగదొక్కేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడినందుకు ప్రతిపక్ష నేతలను పార్లమెంట్ నుండి సస్పెండ్ చేశారు. పాత్రికేయులు, పౌర హక్కుల కార్యకర్తలను కూడా కటకటాల వెనక్కి నెట్టారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామిక స్వేచ్ఛ కోసం పోరాడుతున్న సంస్థలు ఈ చర్యలను విమర్శించాయి' అని ఆయన అన్నారు.

మందిర నిర్మాణం ఘనకార్యమా?

అయోధ్యలో రామమందిర నిర్మాణాన్ని ఓ ఘనకార్యంగా బిజెపి, మోడీ ఎన్నికల ప్రచారంలో చెప్పుకుంటున్నారని కరత్ ఎద్దేవా చేశారు. అది ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమమని, మోడీ పురోహితుడిగా వ్యవహరించారని చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరు కానందుకు ప్రతిపక్షాలను బిజెపి విమర్శించిందని, అది ఒక రాజకీయ ప్రాజెక్ట్ అయినందునే ప్రతిపక్షాలు ఆ ఆహ్వానాన్ని తిరస్కరించాయని తెలిపారు. మతతత్వ అజెండా కోసం మతాన్ని, రాజకీయాన్ని కలగలిపారని విమర్శించారు. రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని, దేశాన్ని హిందూత్వ రాష్ట్రంగా మార్చేసే ఉద్దేశంతో మనువాద సిద్ధాంతాన్ని అమలు చేస్తోందని ధ్వజమెత్తారు.

బిజెపియే అవినీతి పార్టీ

'ఇండియా కూటమిని అవినీతి పార్టీల కలయికగా బిజెపి, మోడీ పిలుస్తున్నారు. బిజెపియే అత్యంత అవినీతి పార్టీ అని ఎన్నికల బాండ్ల ఉదంతం నిరూపించింది. చట్టాలను సవరించి బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టారు. విరాళాల కోసం ఖాతాలు తెరిచేందుకు సిపిఎం నిరాకరించింది. బాండ్ల పథకాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పథకం రాజ్యాంగ విరుద్ధమని ఆరు సంవత్సరాల తర్వాత సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. బాండ్లలో సగానికి పైగా బిజెపి ఖాతాలోకే చేరాయి. ప్రజలను బెదిరించేందుకు ఆ డబ్బును బిజెపిఉపయోగించింది. ఎన్నికల బాండ్ల ద్వారా జరిగిన మనీ లాండరింగ్, అవినీతిపై విచారణ జరపాలి. దానిని సుప్రీంకోర్టు పర్యవేక్షించాలి' అని కరత్ కోరారు.

వరదల సమయంలోనూ నిధులివ్వరు

దేశం రాష్ట్రాల సమాఖ్యగా ఉండాలా, దేశంలో ఫెడరలిజం ఉండాలా అనే అంశాలను రాబోయే ఎన్నికలు నిర్ణయిస్తాయని కరత్ చెప్పారు. బిజెపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు 'ఒకే దేశం...ఒకే భాష...ఒకే సంస్కృతి' విధానాన్ని కోరుకుంటున్నాయని తెలిపారు. ఆ పార్టీ నాయకులు దేశంలో ఒకే ఎన్నికలు ఉండాలని కూడా భావిస్తున్నారని, ఇది ఫెడరల్ నిర్మాణాన్ని నాశనం చేస్తుందని అన్నారు. పాలకులు గవర్నర్లను వాడుకుంటున్నారని, వారేమో వైస్రాయ్‌ల మాదిరిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వరదల సమయంలో సైతం తమిళనాడుకు బిజెపి ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని కరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇడి, ఐటి గూండాగిరీ

- సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్



త్రిసూర్ : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), ఆదాయ పన్ను శాఖలు గూండాయిజాన్ని ప్రదర్శిస్తున్నాయని సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. సిపిఎం బ్యాంకు ఖాతాలన్నింటినీ చట్టబద్ధంగా నిర్వహిస్తోందని అన్నారు. సిపిఎం త్రిస్సూర్ జిల్లా కమిటీ బ్యాంక్ ఖాతాను ఆదాయపన్ను శాఖ అధికారులు స్తంభింపచేశారు. పార్టీకి శనివారం రాత్రి నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని చట్టపరంగా సవాలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ చర్య పార్టీని భయభ్రాంతులకు గురిచేసే యత్నమని అన్నారు. ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటంలో దాడిని ఎదుర్కోవలసిందేనని అన్నారు. చట్టబద్ధం కాని ప్రతీది చట్టబద్ధంగా వ్యవహరించాలని ఉద్దేశించింది. త్రిసూర్‌లో ఖాతాల గురించి పార్టీ నాయకత్వానికి తెలుసు. వాస్తవానికి అన్ని ఖాతాలు కేంద్రానికి ఇచ్చామని అన్నారు. వారికి తెలియని ఒప్పందం ఏమైనా ఉందా, అంతా పారదర్శకం కాదా అని ప్రశ్నించారు. 14 జిల్లాల, రాష్ట్ర కమిటీల ఖాతాలను కూడా ఇచ్చామని అన్నారు.

మోడీ త్రిసూర్‌లో మకాం వేసినా సురేష్ గోపి గెలవలేడు

ప్రధానమంత్రి నరేంద్రమోదీ త్రిసూర్ లో మకాం వేసినా బిజెపి అభ్యర్థి సురేష్ గోపి గెలవలేరని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్ అన్నారు. శనివారం మాల, చలకుడిలో జరిగిన ఎల్‌డిఎఫ్ ఎన్నికల ర్యాలీల్లో ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్ష పార్టీల నాయకులను వేధించేందుకు ఇడితో పాటు ఇప్పుడు ఆదాయపు పన్ను శాఖ కూడా వస్తోంది. వాళ్ల చేతుల్లో మోదీ కత్తి ఉంది.సిపిఐ(ఎం) త్రిసూర్ జిల్లా కమిటీకి దశాబ్దాలుగా ఖాతా ఉంది. డబ్బుకు సంబంధించిన కచ్చితమైన ఖాతా ఉంది. ఏటా ఆడిట్ చేసి వివరాలు ఇవ్వడం జరుగుతోంది.అతిపెద్ద ఆర్థిక నేరానికి పాల్పడిన బిజెపి ఖాతాలు స్తంభింపజేయడం కానీ, ఆ పార్టీపై జరిమానా విధించడం కానీ ఎందుకు చేయరు అని గోవిందన్ ప్రశ్నించారు.

ప్రబీర్ పుర్కాయస్థకు ఆప్ సంఘీభావం

న్యూఢిల్లీ : న్యూస్‌క్లిక్ పోర్టల్ సంపాదకుడు ప్రబీర్ పుర్కాయస్థ అరెస్టుపై అమ్‌ఆద్మీ పార్టీ తొలిసారిగా స్పందించింది. ప్రస్తుతం జైలులో ఉన్న పుర్కాయస్థకు మద్దతుగా దేశ రాజధానిలో శనివారం జరిగిన సంఘీభావ సమావేశానికి ఆ పార్టీ నేతలు హాజరయ్యారు. గత సంవత్సరం అక్టోబరులో న్యూస్‌క్లిక్ పోర్టల్ వెబ్‌సైట్ పైన, దాని ఉద్యోగుల పైన జరిగిన దాడులను అమ్‌ఆద్మీ పార్టీ అప్పుడే నిరసించింది. తాజాగా జైలులో ఉన్న పుర్కాయస్థకు సంఘీభావం తెలిపింది.

పుర్కాయస్థను చాలా కాలంగా కస్టడీలో ఉంచడాన్ని ఆప్ ఢిల్లీ విభాగం కన్వీనర్, రాష్ట్ర మంత్రి గోపాల్ రాయ్ తప్పుపట్టారు. సంఘీభావ సమావేశంలో ఆయన వామపక్ష నేతలతో కలిసి వేదికను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ 'జైలు లోపల ఉన్నదా లేదా బయట ఉన్నదా అనేది కొద్ది రోజుల తర్వాత తెలుస్తుంది. జైలులో ఉన్న వారు అరెస్టయ్యారా లేక జైలు బయట ఉన్న వారు అరెస్టయ్యారా అనేది కొద్ది రోజుల లోనే తెలిసిపోతుంది' అని వ్యాఖ్యానించారు. భారత్‌పై అంతర్జాతీయ పరిణామాలు చూపుతున్న ప్రభావంపై వీడియోలు రూపొందించినందుకు ఆయన పుర్కాయస్థను కొనియాడారు. ప్రత్యామ్నాయ మీడియా అనేది విప్లవానికి మాధ్యమం అని న్యూస్‌క్లిక్‌పై జరిగిన దాడులు నిరూపించాయని గోపాల్ రాయ్ చెప్పారు.

దేశాన్ని కాపాడుకోవాలి : ఏచూరి

దేశంలో న్యాయానికి నిర్వచనం మారిపోయిందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వ్యాఖ్యానించారు. నేరం రుజువయ్యే వరకూ అమాయకుడేననేది గతమని, అమాయకత్వాన్ని నిరూపించుకునేంత వరకూ తప్పు చేసిన వాడివేనన్నది ఇప్పటి అర్థమని చెప్పారు. 'అత్యవసర పరిస్థితి సమయంలో మేము ఎలా పోరాడి దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించామో ఇప్పుడు మనం నియంతృత్వాన్ని, ఫాసిస్టు ధోరణిని ఓడించి భవిష్యత్తులో మరింత మెరుగైన భారతావనిని నిర్మించాల్సిన అవసరం ఉన్నదని, తద్వారా దేశాన్ని కాపాడుకోవాలని ఏచూరి పిలుపునిచ్చారు. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా ప్రసంగిస్తూ ఇప్పుడు మనం ఫాసిస్టు ప్రభుత్వంతో పోరాడుతున్నామని చెప్పారు.

గుజరాత్ వర్శిటీలో ముస్లిం ఫోబియా

- హాస్టల్ నుంచి ఏడుగురు విదేశీ విద్యార్థుల గెంటివేత

అహ్మదాబాద్ : బిజెపి అధికారంలో ఉన్న గుజరాత్‌లో ముస్లిం ఫోబియా విస్తరిస్తోంది. గుజరాత్ విశ్వవిద్యాలయంలో ఏడుగురు విదేశీ విద్యార్థులను వర్శిటీ యాజమాన్యం హాస్టల్ నుండి వెళ్లగొట్టింది. నమాజ్ చేస్తున్న వీరిపై కొందరు దుండగులు దాడి చేసిన అనంతరం వారిని హాస్టల్స్ నుండి ఖాళీ చేయించినట్లు సీనియర్ అధికారి ఒకరు ఆదివారం తెలిపారు. హాస్టల్ ఆవరణలో నమాజ్ చేశారంటూ విదేశీ విద్యార్థులపై మార్చి 16న కొందరు దుండగులు దాడి చేసిన సంగతి తెలిసిందే. తజికిస్థాన్, శ్రీలంక విద్యార్థులు దాడి ఘటనతో ఆస్పత్రి పాలయ్యారు. ఈ ఘటన జరిగిన కొన్ని రోజుల అనంతరం ఆఫ్ఘనిస్థాన్, గాంబియన్ ప్రతినిధి బృందం యూనివర్శిటీని సందర్శించింది. భద్రతా చర్యలపై యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌తో సమావేశం నిర్వహించింది. ఈ అంశంపై యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ నిరజా గుప్తా మీడియాతో మాట్లాడారు. ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు, తూర్పు ఆఫ్రికాకు చెందిన మరో విద్యార్థి చదువు పూర్తయినా హాస్టల్‌లోనే ఉంటున్నట్లు గుర్తించామని అన్నారు. అడ్మినిస్ట్రేటివ్ వర్క్ కారణంగా హాస్టల్‌లో మాజీ విద్యార్థులుగా ఉంటున్నారని అన్నారు. దీంతో వారు ఇకపై హాస్టల్‌లో ఉండాల్సిన అవసరంలేదని, తమ దేశాలకు తిరిగి వెళ్లేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. విదేశాలకు వెళ్లేందుకు అవసరమైన పత్రాలను పూర్తి చేశామని, ఇక వారు సురక్షితంగా వారి దేశాలకు వెళ్లవచ్చు అని అన్నారు. మాజీ విద్యార్థులు హాస్టల్‌లో ఉంచడం ఇష్టంలేదని అన్నారు. ఆయా దేశాల రాయబారులకు సమాచారం ఇచ్చామని, హాస్టల్స్‌ను కూడా ఖాళీ చేయాల్సిందిగా ఆదేశించామని చెప్పారు. గుజరాత్ యూనివర్శిటీలో సుమారు 300కు పైగా విదేశీ విద్యార్థులు ఉన్నారని అన్నారు.

పౌర స్మృతిలో వివాహ, కుటుంబ భాగాలకు న్యాయ సవరణలు

- ప్రజల ముందుకు చైనా సుప్రీంకోర్టు ముసాయిదా

బీజింగ్ : చైనా పౌర స్మృతి (సివిల్ కోడ్)లో వివాహ, కుటుంబ వ్యవహారాలకు సంబంధించిన భాగానికి న్యాయ వివరణలు సూచిస్తూ రూపొందించిన ముసాయిదాను ఆ దేశ సుప్రీం పీపుల్స్ కోర్టు (ఎస్‌పిసి) ఆదివారం విడుదల చేసింది. న్యాయ వివరణల ముసాయిదాపై సాధారణ ప్రజానీకం ఈ నెల 30 లోగా తమ సూచనలు, సలహాలను పంపవచ్చునని ఎస్‌పిసి ఒక ప్రకటనలో ఆహ్వానించింది. సివిల్ కోడ్‌లోని వివాహ, కుటుంబ వ్యవహారాలకు సంబంధించిన అనేక వివాదాలకు న్యాయ పరిష్కారాలను ముసాయిదాలో పొందుపర్చారు. ప్రధానంగా 'నకిలీ' విడాకులకు సంబంధించిన వివాదాల నియంత్రణపై ముసాయిదాలో దృష్టి సారించారు. విడకాలు పొందిన దంపతుల్లో ఎవరైనా ఒకరు తమ విడాకాలు సరైనవి కావంటూ నాయస్థానాన్ని ఆశ్రయిస్తే వెంటనే ఆ విడాకాలను చెల్లుబాటు కానివిగా న్యాయమూర్తులు ప్రకటించరాదని ముసాయిదా సూచిస్తోంది. అయితే తాము తీసుకున్న విడాకాలు 'నకిలీవి' అని, పంపకాలు పూర్తి అయిన ఆస్తులను తిరిగి ఉమ్మడిగా రీ డిస్పోజ్ చేయాలని దంపతుల్లో ఏవరైనా ఒకరు న్యాయస్థానాన్ని అభ్యర్థిస్తే అందుకు అనుమతి ఇవ్వవచ్చునని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో లైవ్ స్ట్రీమింగ్‌కు సంబంధించి వర్చువల్ గిఫ్టింగ్‌ల వివాదాలపైనా ఎస్‌పిసి దృష్టి సారించింది. ముసాయిదా ప్రకారం..ఎనిమిదేళ్ల లోపు వయస్సున్న పిల్లలు ఎవరైనా లైవ్ స్ట్రీమింగ్ సమయంలో క్రియేటర్లకు వర్చువల్ బహుమతులు పంపితే వాటిని ఆ పిల్లల తల్లిదండ్రులు, సంరక్షకులు వెనక్కి ఇచ్చేయాలని క్రియేటర్లను కోరితే..అటువంటి సందర్భాల్లో పిల్లలు పంపిణీ బహుమతులను, డబ్బును క్రియేటర్లు వెనక్కి ఇచ్చేయాల్సివుంటుందని పేర్కొన్నారు. అలాగే 8 నుంచి 16 ఏళ్ల మధ్య వయస్సున్న మైనర్లు లేదా 16 ఏళు పైబడి వయస్సు ఉండి వేరుగా జీవనం సాగించకుండా తల్లిదండ్రులు లేదా సంరక్షకులు వద్దనే జీవిస్తుంటే అటువంటి పిల్లలు ఒకవేళ పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేస్తే ఆ డబ్బును తల్లిదండ్రులు, సంరక్షకులు వెనక్కి ఇచ్చేయాలని క్లయిమ్ చేస్తే పిల్లలు ఎవరికి అయితే డబ్బులు ఇచ్చారో వారు తిరిగి ఇచ్చేయాలని ముసాయిదాలో తెలిపారు.

జింబాబ్వేలో 30 నుంచి కొత్త మారకం

హరారే : జింబాబ్వే ఆర్థిక వ్యవస్థలో ఈ నెల 30 నుంచి కొత్త మారకం చలామణిలోకి రానుంది. ప్రస్తుతమున్న జింబాబ్వే డాలరు మారకం స్థానంలో జింబాబ్వే గోల్డ్ (జిగ్) అందుబాటులోకి వస్తుందని రిజర్వు బ్యాంక్ ఆఫ్ జింబాబ్వే (ఆర్‌బిజెడ్) గవర్నరు జాన్ ముషాయవన్హ తెలిపారు. ఇప్పటికే జిగ్ నోట్లు, నాణేలు ముద్రణ పూర్తయ్యాయని శనివారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో ముషాయవన్హ పేర్కొన్నారు. 1, 2, 5, 10, 50, 100, 200 డినామినేషన్లలో జిగ్ నోట్లు, వీటికి అదనంగా అర, పావు జిగ్ నాణేలు లభిస్తాయని తెలిపారు.

కేజ్రీవాల్‌ను సిఎంగా తొలగించాలంటూ మరో పిల్

న్యూఢిల్లీ : అరవింద్ కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రి పదవి నుండి తొలగించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో మరో పిల్ దాఖలైంది. మాజీ ఆప్ మంత్రి సందీప్ కుమార్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై సోమవారం ఢిల్లీ హైకోర్టు విచారణ చేపట్టనుంది. ఆయనను సిఎం పదవి నుండి తొలగించాలంటూ ఢిల్లీ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌లలో ఇది మూడవది. కేజ్రీవాల్ జైలులో ఉన్నందున విపత్తు నిర్వహణ చట్టం, 2005 లోని సెక్షన్ 14లోని సబ్‌సెక్షన్ (4)కి నిబంధన ప్రకారం, 239 ఎఎ (4), 167 (బి), (సి) ప్రకారం రాజ్యాంగ విధులను నిర్వర్తించే సామర్థ్యం ఆయనకు లేదంటూ పిటిషన్‌లో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జైలులో ఉన్నప్పుడు ఢిల్లీ చట్టం, 1991లోని సెక్షన్ 45 (సి)కి సమానమైన రాజ్యాంగంలోని ఆర్టికల్ 167 (సి) ప్రకారం లెఫ్టినెంట్ గవర్నర్ ఆయన రాజ్యాంగ విధులను నిర్వర్తించకుండా అడ్డుకుంటారని పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 ప్రకారం రిట్ ఆఫ్ కో వారెంట్ కోసం ఈ పిటిషన్ అని పిల్‌లో పేర్కొన్నారు.

ఐదేళ్లలో 30 రెట్లు పెరిగిన తేజస్వీ సూర్య ఆస్తులు

బెంగళూరు: కర్నాటక బిజెపి ఎంపీ, ఆ పార్టీ యువమోర్చా జాతీయాధ్యక్షుడు తేజస్వి సూర్య ఆస్తులు అమాంతం పెరిగాయి. గత ఐదేళ్లలో దాదాపు 30 రెట్లు ఎగబాకాయి. 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం ఆయన దాదాపు రూ. 14 లక్షల ఆస్తులతో లక్షాధికారిగా ఉన్న ఆయన ఇప్పుడు 2024 నాటికి దాదాపు రూ.4 కోట్ల ఆస్తులతో కోటీశ్వరుడయ్యారు. గురువారం నామినేషన్‌తో పాటు దాఖలు చేసిన సూర్య ఎన్నికల అఫిడవిట్‌లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. 2019కి ముందు.. సూర్య కర్నాటక మాజీ అడ్వకేట్ జనరల్(ఏజీ) అశోక్ హరన్‌హల్లి కార్యాలయంలో 'లా అసోసియేట్'గా పనిచేశారు. తేజస్వీ సూర్య తన చివరి ఆదాయపు పన్ను రిటర్న్‌లో 2018-19 ఏడాదికి గానూ రూ. 11,91,000 ఆదాయం చూపించగా.. అది 2022-23లో రూ. 44,13,050గా ఉండటం గమనార్హం. సూర్య చేతిలో రూ.80,000 నగదు, రూ.5.19 లక్షలకు పైగా డిపాజిట్లు చూపించారు. బెంగళూరులో ఎన్నికల ఖర్చు ఖాతాలో రూ.25,000 కూడా చూపించాడు. తేజస్వీ సూర్య.. రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ నేతృత్వంలోని నెట్‌వర్క్ 18 మీడియా అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్‌లో గరిష్టంగా 30,000 షేర్లను కలిగి ఉన్నాడు. దీని విలువ రూ. 26,65,500గా ఉన్నది. 'చరాస్తుల విలువ' మాత్రమే రూ. 4,10,30,489.95గా ఉన్నదనీ, తన పేరుతో ఎలాంటి ఆస్తి, వాణిజ్య ఆస్తులు, వాహనాలు, రుణాలు లేవని బిజెపి ఎంపీ ప్రకటించారు. తేజస్వీ సూర్యపై మూడు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

కాంగ్రెస్‌ను జిన్నా ముస్లిం లీగ్‌తో పోల్చిన మోడీ

- వామపక్షాలపైనా అక్కసు



న్యూఢిల్లీ: ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ప్రధాని మోడీలో అసహనం పెరిగిపోతోంది. ప్రతిపక్షాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో ఒక వైపు దాడులు చేయిస్తూ, మరొక వైపు ప్రతిపక్షాలపై బురదచల్లే కార్యక్రమాన్ని తీవ్రతరం చేశారు. శనివారం షహరాన్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ, కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోపై తీవ్రంగా విచుచుకుపడ్డారు. స్వాతంత్ర్యానికి ముందు జిన్నా ముస్లిం లీగ్ భావజాలంతో పోల్చి విభజన రాజకీయాలకు ఆజ్యం పోసే ప్రయత్నం చేశారాయన. ఈ కాంగ్రెస్ 21వ శతాబ్దంలో భారతదేశాన్ని ముందుకు తీసుకెళ్ళదని ఆక్రోశించారు..." వామపక్షాలపైనా అక్కసు వెళ్లగక్కారు. 'ఇండియా' వేదిక నాయకులపైనా రుసరుసలాడారు. ఈ వేదికలో చాలా మంది నాయకులున్నారు. వారి దృష్టి అంతా ప్రధాని కుర్చీపైనేనని మోడీ ఆరోపించారు. వామపక్షాలు కానీ, కాంగ్రెస్ కానీ తమ మ్యానిఫెస్టోలో దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించడం గురించి నొక్కిచెప్పాయి. మరోవైపు ప్రజా ఆధారిత కార్యక్రమాలకు ప్రాధాన్యమిచ్చాయి.. ప్రజాస్వామంమంచ సమాజంలోని అన్ని వర్గాలు పౌర హక్కుల పరిరక్షణకు పిలుపునిచ్చాయి. మోడీ అక్కసుకు ఇదే కారణమని పరిశీలకులు భావిస్తున్నారు. . స్వాతంత్ర్య పోరాటం నడిపిన కాంగ్రెస్ దశాబ్దాల క్రితం నాటిదని, నేటి కాంగ్రెస్‌కు దేశానికి దిశా నిర్దేశం చేసే విజన్ ఏమీ లేదని ఆయన ఆరోపించారు. వామపక్షాలను కూడా మోదీ లాగుతూ, ముస్లిం లీగ్ ఆలోచన తర్వాత , ఆ స్థానంలో వామపక్షాల ఆలోచన చొరబడిందంటూ విషం గక్కారు. కమ్యూనిస్టులపై దాడి ఇదే మొదటి సారి కాదు. గత సంవత్సరం ఆరెస్సెస్ వ్యవస్థాపక దినమైన 'విజయ దశమి' నాడు ఆ సంస్థ అధిపతి మోహన్ భగవత్ మాట్లాడుతూ, " ప్రస్తుతం దేశానికి ప్రధాన శత్రువు సాంస్కృతిక మార్క్సిస్టులే" అంటూ చిందులేశారు. ప్రతిపక్షాలు మైనార్టీల హక్కుల గురించి డిమాండ్ చేసినప్పుడల్లా " ముస్లింలను బుజ్జగిస్తున్నారు" అంటూ బిజెపి, ఆరెస్సెస్ విరుచుకుపడుతున్నాయి. కొన్నిసార్లు నిరసనకారులను తుక్డే తుక్డే గ్యాంగ్‌లని, వారు సమాజాన్ని విచ్ఛిన్నం చేయాలనుకుంటున్నారని ఆరోపించాయి. ఈసారి మహమ్మద్ అలీ జిన్నా ముస్లిం లీగ్‌ని నేరుగా లాగారు. జిన్నా విషయాన్ని అలా ఉంచితే, స్వాతంత్ర్య పోరాటంలో ఆరెస్సెస్ పాత్ర ఏమిటో మోడీ మహాశయుడు సెలవిస్తే బాగుండేదని పరిశీలకులు వ్యాఖ్యానించారు. 'ఇండి' బ్లాక్ అనిశ్చితికి, అస్థిరతకు పర్యాయపదం" అని, . ప్రజలు కూడా వాటిని పట్టించుకోవడం లేదని మోడీ విమర్శించారు.

మోడీ వ్యాఖ్యలపై ప్రతిపక్షాల నేతలు స్పందిస్తూ, ఎన్నికల్లో ఓటమి భయంతోనే మోడీ ఇటువంటి ప్రేలాపనలు పేలుతున్నారని అన్నారు. 'ఇండియా' వేదిక మార్చి 31న ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో నిర్వహించిన ర్యాలీకి పెద్దయెత్తున జనం రావడంతో. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు బెంబేలెత్తుతున్నాయన్నారు.

ఎన్‌సిఇఆర్‌టి పాఠ్య పుస్తకాల నుండి బాబ్రీ కూల్చివేత, గుజరాత్ నరమేధం తొలగింపు

- వామపక్షాల నిర్వచనాన్ని మార్చేశారు

న్యూఢిల్లీ: బాబ్రీ మసీదు కూల్చివేత, గుజరాత్ నరమేధం అంశాలను ఎన్‌సిఇఆర్‌టి పాఠ్య పుస్తకాల నుండి తొలగించారు. వామపక్షాలకు సంబంధించిన నిర్వచనాన్ని కూడా మార్చేశారు. ఆరెస్సెస్‌కు చెందిన మనుషులతో ఎన్‌సిఇఆర్‌టిని కేంద్ర ప్రభుత్వం నింపేసిన తరువాత పాఠ్య పుస్తకాల నుంచి లౌకికత్వ అంశాలను ఒక్కొక్కటి తొలగించేస్తున్నారు. ఆ క్రమంలో 2002లో రెండు వేల మంది ముస్లింలను ఊచకోత కోసిన గుజరాత్ నరమేధాన్ని,, దేశ లౌకిక స్ఫూర్తిని మంట గలిపిన బాబ్రీ మసీదు కూల్చివేత ఘటన గురించిన వాస్తవాలను భావి తరాలకు తెలియకుండా చేసేందుకు ఈ చర్య తీసుకున్నారు. ఈ మార్పులు రొటీన్ అప్‌డేట్‌లో భాగమని ఎన్‌సిఇఆర్‌టి అధికారులు తెలిపారు. పదకొండు, పన్నెండు తరగతుల పొలిటికల్ సైన్స్, సోషల్ సైన్స్ పాఠ్యపుస్తకాల నుంచి ఈ అంశాలను తొలగించారు.

ఎన్‌సిఇఆర్‌టి సిలబస్ ముసాయిదా కమిటీ రూపొందించిన మార్పులను వివరించే పత్రం ప్రకారం, "రాజకీయాల్లో ఇటీవలి పరిణామాల దష్ట్య" రామజన్మభూమి ఉద్యమానికి సంబంధించిన ప్రస్తావ-నలోనూ మార్పులు చేశారు.

అంతకుముందు, 11వ తరగతి పాఠ్యపుస్తకంలోని సెక్యులరిజంపై ఎనిమిదవ అధ్యాయంలో "2002లో గుజరాత్‌లో గోద్రా అనంతర అల్లర్ల సమయంలో 1,000 మందికి పైగా ముస్లింలు మరణించారు." అని ఉంది. దానిని '2002లో గుజరాత్‌లో గోద్రా అనంతర అల్లర్లలో 1,000 మందికి పైగా మరణించారు" అని మార్చారు. ఈ మార్పు వెనుక ఎన్‌సిఇఆర్‌టి తర్కం ఏమిటంటే, "ఏదైనా అల్లర్లు అన్ని వర్గాల ప్రజలను ప్రభావితం చేస్తాయి. కాబట్టి ఒక్క శాఖ గురించే పేర్కొనడం సరికాదు".

12వ తరగతి పొలిటికల్ సైన్స్ పాఠ్యపుస్తకంలోని ఏడవ అధ్యాయంలో ఆర్టికల్ 370ని రద్దును సమర్థించుకునే విధంగా పద ప్రయోగాల్లో మార్పులు చేసింది." జమ్మూ కాశ్మీర్ కోసం ప్రత్యేక నిబంధనలు కలిగిఉన్న ఆర్టికల్ 370ని 2019 ఆగస్టులో రద్దు చేయడం జరిగింది" అని సవరించారు. అలాగే పాక్ ఆక్రమిత కాశ్మీర్ ప్రాంతాన్ని పాకిస్తాన్ 'అజాద్ పాకిస్తాన్' అని పిలుస్తుందని ఇప్పటివరకు ఉన్న పాఠ్య పుస్తకాల్లో ఉండగా, ఇప్పుడు ఆ వాక్యాన్ని సవరించి "పాకిస్తాన్ అక్రమంగా ఆక్రమించిన భూభాగం ఇది, దీనిని "పాక్ అక్రమిత జమ్మూ కాశ్మీర్" అని పిలుస్తారని పేర్కొంది. జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు సంబంధించిన ప్రస్తావనలోనూ మార్పులు చేసింది. మానవ హక్కుల కమిషన్ దేశంలో వివిధ ప్రాంతాల్లో మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన కేసులు చేపడుతుందని, మానవ హుందాగా జీవించడం కోసం పోరాడాల్సిన ఆవశ్యకత గురించి, మానవ హక్కుల గురించి ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు కృషి చేస్తుందని ఇంతకుముందున్న పాఠ్య పుస్తకాల్లో ఉంది. ఇప్పుడు మార్చిన తరువాత ఇలా పేర్కొంది."మానవ హక్కుల కమిషన్ దేశంలో వివిధ రంగాల్లో జరిగే మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన అంశాలను దేశ ప్రజల దృష్టికి తెస్తుంది" అని ఉంది. అదే పాఠ్యపుస్తకంలో మూడవ అధ్యాయంలో వామపక్షాలకు సంబంధించిన నిర్వచనాన్ని కూడా మార్చేసింది. ఇంతకుముందున్న వెర్షన్‌లో "వామపక్షాలు పేదలు, అణచివేతకు గరైన వారికి అనుకూలమైన ప్రభుత్వ విధానాలను సమర్థించేవారిని వామపక్షవాదులు అంటారు " అని ఉంది. మార్చిన వెర్షన్‌లో ఏం చెప్పారంటే, "ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని, స్వేచ్ఛా మార్కెట్ పోటీని ప్రభుత్వం రెగ్యులేట్ చేయాలని వాదించే వారు వామపక్షవాదులు" అని పేర్కొంది. సిబిఎస్‌ఇ స్కూళ్లకు ఎన్‌సిఇఆర్‌టి గత వారం జారీ చేసిన సర్క్యులర్‌లో మూడవ తరగతి నుండి ఆరవ తరగతి పాఠ్య పుస్తకాల్లో కొత్త పాఠ్య పుస్తకాలను తయారు చేశామని, మిగతా క్లాసులకు ఎలాంటి మార్పులు ఉండవని పేర్కొంది. ఇప్పటికే నూతన అకడమిక్ సెషన్ ప్రారంభమైంది. ఈ మార్పులు చేర్పులు చేసిన పాఠ్య పుస్తకాలు ఇంకా మార్కెట్‌లోకి ఇంకా రావాల్సి ఉంది.



అనంత్‌నాగ్‌లో అజాద్‌పై మెహబూబా పోటీ

- కాశ్మీర్‌లో 3 స్థానాల్లో పిడిపి పోటీ
- జమ్ములో రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్‌కు మద్దతు

శ్రీనగర్ : పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ అధినేత మెహబూబా ముఫ్తీ లోక్‌సభ ఎన్నికల్లో అనంత్‌నాగ్ - రాజౌరీ స్థానం నుంచి డిపిఎపి అధ్యక్షులు గులాం నబీ ఆజాద్‌పై పోటీ చేయనున్నారు. ఈ స్థానంతో సహా జమ్ముకాశ్మీర్‌లోని మూడు స్థానాలకు పిడిపి తమ అభ్యర్థులను ప్రకటించింది. పార్టీ యువ విభాగం అధ్యక్షులు వాహీద్ పర్రా శ్రీనగర్ నుంచి రాజ్యసభ మాజీ సభ్యులు మీర్ ఫయాజ్ బారాముల్లా లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయనున్నట్లు పిడిపి పార్లమెంటరీ బోర్డు ఛీఫ్ సర్తాజ్ మండి ఆదివారం చెప్పారు. అయితే కాశ్మీర్‌లోయలో మీకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందా అని ప్రశ్నించగా..తాము జాతీయ పార్టీ నుంచి క్విడ్ ప్రోకో తరహాలో మద్దతు ఆశించడం లేదని, భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునే పోరాటంలో భాగంగానే జమ్ములో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నామని పిడిపి అధినేత్రి మెహబూబా ముఫ్తీ తెలిపారు. కాగా జమ్ము ప్రాంతంలోని ఉధంపుర్, జమ్ము లోక్‌స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా పిడిపి ప్రచారం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంత్‌నాగ్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ నుంచి గుజ్జార్ నేత మియాన్ అల్తాఫ్ పోటీ చేస్తున్న సంగతి విదితమే. కాగా అప్నీ పార్టీ నుంచి జఫార్ ఇక్బాల్ మన్‌హాస్ బరిలో ఉన్నారు. బిజెపి ఇంకా అభ్యర్థిని ప్రకటించాల్సివుంది.

నెతన్యాహు రాజీనామా కోసం వెల్లువెత్తిన నిరసనలు

జెరూసలెం: ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు రాజీనామా కోసం డిమాండ్ చేస్తూ దేశవ్యాపితంగా నిరసనలు వెల్లువెత్తాయి. గాజాపై దాడి జరిగి ఆరుమాసాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్త నిరసనల్లో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. త్వరలో ఎన్నికలు నిర్వహించండి అంటూ నిరసనకారులు బిగ్గరగా నినదించారు.

వివాదాస్పద న్యాయ సంస్కరణలకు వ్యతిరేకంగా గత సంవత్సరం జరిగిన భారీ నిరసనల తర్వాత టెల్ అవీవ్ స్క్వేర్‌లో లక్ష మంది వరకు ప్రజలు గుమిగూడారని, దీనిని "డెమొక్రసీ స్క్వేర్"గా మార్చారని నిర్వాహకులు తెలిపారు. నిరసనకారులకు గాజా బందీల కుటుంబ సభ్యులు మద్దతుగా నిలిచారు. ర్యాలీ సందర్భంగా నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించడంతో ఘర్షణలు జరిగాయి. నెతన్యాహు రాజీనామా చేస్తే తప్ప దేశం ముందుకు సాగదని ఆందోళనకారులు పేర్కొన్నారు.. గాజాపై దాడి నేపథ్యంలో ప్రపంచంలో ఇజ్రాయిల్ ఏకాకి అయినా, నెతన్యాహు ప్రభుత్వానికి బుద్ధి రాలేదని, దురాగతాలు కొనసాగుతున్నాయని ఇజ్రాయెల్ ప్రతిపక్ష నాయకుడు యాయిర్ లాపిడ్ అన్నారు.

ఇజ్రాయెల్ దాడిలో గాజాలో ఇప్పటివరకు 33వేలకు పైగా మరణించారు. గాయపడిన వారి సంఖ్య 75,815 దాటింది. గత 24 గంటల్లో 46 మంది చనిపోయారు. 65 మంది గాయపడ్డారు. ఇప్పటి వరకు 13,800 మంది చిన్నారులు చనిపోయారు. జనాభాలో 80 శాతానికి పైగా నిరాశ్రయులయ్యారు. హమాస్‌పై యుద్ధ వ్యూహంలో భాగంగా గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ తీవ్ర దిగ్బంధనాన్ని విధించింది. దీని పర్యవసానంగా 10 లక్షల మందికి పైగా ప్రజలు తీవ్ర ఆకలితో అలమటిస్తున్నారు. చాలా మంది పిల్లలు ఆకలి మరియు పోషకాహార లోపంతో చనిపోయారు. చాలా కుటుంబాలకు రోజుకు ఒక్కసారైనా తినడానికి సరిపడా ఆహారం లేదు. రాబోయే వారాల్లో ఇక్కడ ఆకలి చావులు పెరుగుతుండడం పట్ల మానవ హక్కుల కార్యకర్తలు, సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



నెతన్యాహును నేరాల మంత్రిగా పేర్కొంటూ ఆయన తక్షణమే ప్రధాన పదవీకి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం టెల్‌అవివాలో పోటెత్తిన నిరసనలు




మీ కోసం

అరటి పండ్లు త్వరగా పాడవకుండా ఉండాలంటే, వాటిని ఉప్పు కలిపిన నీటిలో వేసి ఉంచాలి.

జీవన సౌరభం

ఇతరుల కంటే మెరుగ్గా ఉండడం కాదు; నీకంటే నీవు మెరుగ్గా తయారవ్వాలని కోరుకోవాలి.

ఏనుగు-గడ్డిపోచ




ఒక అడవిలో ఏనుగు ఉంది. రోజూ అడవిలో దుబ్బుగా పెరిగిన గడ్డిని తింటూ 'ఈ గడ్డి పోచలు ఎంత చిన్నవో, కొన్ని నాకు ఆహారమౌతున్నాయి. మరికొన్ని నా కాలి కింద నలిగిపోతున్నాయి' అనుకుంది. ఏనుగు అహంకారం చూసి గడ్డి పోచలకి ఎంతో కోపం వచ్చింది. ఎలాగైనా ఏనుగుకు బుద్ధి చెప్పాలని అనుకున్నాయి.

ఒక రోజు ఒక వేటగాడు గడ్డిపోచలని తొక్కుకుంటూ హడావిడిగా వేటకు వెళుతున్నాడు. అప్పుడు గడ్డిపోచలన్నీ వేటగాడికి వినిపించేలా ఇలా అనుకున్నాయి. 'ఈ వేటగాడు ఇంత కంగారుగా ఎక్కడికి వెళతున్నాడో. బహుశా ఏనుగుని వలలో బంధించేందుకై ఉంటుంది. అంత బలశాలి ఏనుగు ఇతని బాణాలకు చిక్కుతుందా ఏంటి? మనలాంటి గడ్డిపోచలని తాడుగా పేని దాని కాళ్లకు బంధం వేస్తే గాని ఆ ఏనుగుని బంధించలేడు. ఈ విషయం ఇతనికి తెలియదా' అని ఫక్కున నవ్వాయి. ఆ మాటలు విన్న వేటగాడు ఒక్క క్షణం ఆగి ఆ గడ్డిపోచలను కొడవలితో నరికి పెద్ద తాడులా పేనాడు. ఏనుగు వచ్చే దారిలో ఆ తాడుని ఉంచి ఉచ్చు పన్నాడు. ఆకలిగా ఉన్న ఏనుగు గడ్డిపోచలని తిందామని అటుగా వచ్చింది. వేటగాడి వలలో పడింది. తనకు అడ్డుపడిన గడ్డిపోచల తాడుని చూసి 'అయ్యో వీటిని ఎంత చులకనగా చూశాను. కానీ ఈ రోజు ఇవన్నీ తమ ప్రాణాలు పణంగా పెట్టి మరీ నన్ను పట్టించాయి. నాకు బుద్ధి వచ్చింది' అని కన్నీరు కార్చింది.



కె.కీర్తి కీర్తి కిరణ్, 5వ తరగతి, ఎం.పి.పి.ఎస్, వానపాముల (హెచ్.డబ్ల్యు), పెద పారుపూడి మండలం, కృష్ణా జిల్లా.

తేడాలు గుర్తించండి



పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో 10 తేడాలు ఉన్నాయి. గుర్తించండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ





కింతాడ లోకేష్, 4వ తరగతి, ఎంపిపిఎస్ గొంపవానిపాలెం, కె.కోటపాడు మండలం, అనకాపల్లి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కాశ్మీరీ తివాచీ నేతగాళ్ల వెతల కత!

అందమైన ప్రకృతి దృశ్యాలకు నెలవైన జమ్ము కాశ్మీర్ ఇప్పుడు అస్తవ్యస్త పరిస్థితులతో సతమతమవుతోంది. మంచు దుప్పటి కప్పుకున్న పర్వత శ్రేణులు, దాల్ సరస్సు అందాలు, కాశ్మీరీ తివాచీలు వేటికవే ప్రత్యేకమైనవి. ఒకపక్క వాతావరణ కాలుష్యానికి ప్రకృతి అందాలు అంతరించిపోతున్నాయి. మరోపక్క ఉపాధి మార్గం లేక వృత్తి విద్యను వదిలి పెట్టి రోజు కూలీకి తరలిపోతున్నారు ఎందరో తివాచీ నేతదారులు. చేతినిండా డబ్బు, రోజంతా పనితో ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా కాలం గడిపిన వారంతా రోజు కూలీ కోసం పడరాని పాట్లు పడుతున్నారు.

అల్తాఫ్ అహ్మద్ దార్ (37), అన్నం క్యారేజీ బ్యాగులో పెట్టుకుని బుద్గం జిల్లా ముఖమ్ నుంచి వత్రహైల్‌కి ఉదయమే బయలుదేరాడు. అప్పుడు సమయం 7.30 గంటలు. ఆ టైంకి అక్కడ ఉంటేనే 9 గంటలకల్లా హైదర్‌పొరా చౌక్‌కి చేరుకుంటాడు. అక్కడ దార్ లాగే ఎందరో కళాకారులు, చేతివృత్తిదారులు ఉపాధి కోసం బారులు తీరి ఉంటారు. ఊళ్లో ఉదయం బయలుదేరే బస్సులో ఇక్కడికి చేరుకోవడం, దొరికిన పని చేసుకుని సాయంత్రం అదే బస్సులో తిరుగు ప్రయాణమవ్వడం వారి దినచర్యలా మారిపోయింది.

ఒకప్పుడు కాశ్మీరీ తివాచీల కోసం యాత్రికులు, పర్యాటకులు దార్ ఇంటి ముందు గుమిగూడేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోగా, పూట గడవడం కష్టమై దార్ పనిబాట పట్టాడు. పదుల సంఖ్యలో కాదు, వందలమంది ఉపాధి కోసం శ్రీనగర్‌కి ప్రతిరోజూ ప్రయాణాలు చేస్తున్నారంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చు.

15 ఏళ్లుగా బస్సు కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మజీద్ అహ్మద్ ఖాన్ (40) ఈ ప్రయాణాల గురించి ఇలా చెబుతున్నారు. 'పదేళ్ల క్రితం మేము ఇలా బుద్గామ్ గ్రామాల నుంచి శ్రీనగర్‌కి ప్రతి రోజూ బస్సు సర్వీసులు నడపలేదు' అని గతాన్ని గుర్తు చేసుకున్న మజీద్ ఒకప్పుడు తివాచీ నేయడంలో చేయి తిరిగిన కళాకారుడు. రోజుకు వెయ్యి రూపాయలు సంపాదించిన రోజులు కూడా ఉన్నాయి. కానీ, కండెక్టర్‌గా ఇప్పుడు నెల మొత్తం మీద రూ.8000 వేతనమే అందుతోంది.

బస్సులో ప్రయాణించే మొత్తం ప్రయాణీకుల్లో 90 శాతం మంది ఉపాధి కోసం వెళ్లేవారే. బుద్గామ్‌లోని రాయర్, ఖాన్ సాహిబ్, యార్ఖా, వత్రాహైల్, బోనిట్, హుఖ్‌లత్రి, దానాస్ మీదుగా కార్మికులను హైదర్‌పోరాకి చేర్చడం, మళ్లీ సాయంత్రం 6 గంటలకు వారి వారి గ్రామాల్లో ఇంటికి చేర్చే పనిలో బస్సు సర్వీసులు ఉంటున్నాయి. 'ఆ రాత్రంతా అక్కడే ఉండి, ఉదయం పని వేళకి మళ్లీ కార్మికులను హైదర్‌పోరాకి చేరవేయడం మా దినచర్యగా ఉంటుంది' అని మజీద్ చెబుతున్నప్పుడు అతని మాటల్లో ఎంతో ఆవేదన కనిపిస్తోంది.



ఇలా కుదేలయ్యారు ...

హుఖలత్రి గ్రామంలో 2005లో తివాచీ నేసే కళాకారులు వందమంది వరకు ఉండేవారు. ప్రస్తుతం వారి సంఖ్య పదుల సంఖ్యకు చేరుకుంది. గులామ్ నబి భట్ (55). హుఖలత్రి గ్రామంలో తివాచీ నేత కార్మికుడు. 'నేత నేసే కాలంలో అంటే దశాబ్దం క్రితం నేను ఇంటి నుండే రోజుకు రూ.700 సంపాదించేవాడ్ని. కానీ, ఇప్పుడు శ్రీనగర్ వెళ్లి పారిశుధ్య రంగ కార్మికుడిగా పనిచేస్తున్నాను. బస్సు ఛార్జీలు పోను, రోజుకు రూ.500 రావడం కూడా కష్టమే' అంటున్నాడు. గులామ్ వయసు రీత్యా పెద్దవాడు. ఆయన తప్ప ఆ ఇంటిలో సంపాదించే వారు లేరు. ఈ పరిస్థితుల్లో అతనికి ఎంతో కొంత ఆదాయం కావాలి. అందుకే శరీరం సహకరించకపోయినా ఇష్టం లేని పనిలో రోజంతా పని చేస్తున్నాడు.

ఫరూఖ్ అహ్మద్ దార్ (38), బషీర్ అహ్మద్ దార్ (44) అన్నదమ్ములు. 15 ఏళ్ల వయసు నుండీ తివాచీ పనిలో ఉన్నారు. రోజుకు రూ.500 నుంచి రూ.700 వరకు సంపాదించేవారు. క్రమంగా ఆదాయం పడిపోవడంతో అన్నదమ్ములిద్దరూ శ్రీనగర్‌లో కూలి చేసుకుంటున్నారు.

బుద్గామ్ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ పరిస్థితి ఆ జిల్లాకే పరిమితం కాదు. ఆదరించేవారు లేక, కుటుంబాలు గడవక దేశంలో ఎందరో కళాకారులు ఉపాధి బాట పట్టారు. అలివిగాని పనుల్లో, అనువుగాని ప్రదేశాల్లో రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారు. హుందా జీవితం గడిపిన, గౌరవంగా బతికిన ఎంతోమంది తమ ఉనికిని, నైపుణ్యాన్ని కనిపించనీయకుండా చెప్పిన పని చేసుకుంటూ చేతులు బొబ్బలెక్కేలా పనులు చేస్తున్నారు. కళాకారులను గౌరవించడమంటే వారికి తృణమో, పణమో ఇవ్వడం కాదు.. వారి కళను గుర్తించి ప్రోత్సహించడమని ఎన్నో సార్లు చెప్పుకున్నాం. ఈ పరిస్థితి ఇంకెంత కాలమో..!

కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మేలు



కొబ్బరినీరు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. లేత కొబ్బరి నీళ్లలో అనేక సూక్ష్మ పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్, పొటాషియం, సోడియం అత్యధికంగా ఉండి శరీరంలో వ్యాధినిరోధక శక్తి పెంచి ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

- ఈ నీటిలోని కాల్షియం ఎముకల్ని, పళ్ళను దృఢంగా ఉంచి, కండరాల బలోపేతానికి సహకరిస్తుంది.
- శరీరంలో సహజ లవణాల్ని కోల్పోయినప్పుడు కలిగే అలసట నుంచి కొబ్బరి నీరు కాపాడుతుంది. విరోచనాలతో ఇబ్బంది పడే వారు శరీరం డీహైడ్రేషన్ కాకుండా ఉండేందుకు కొబ్బరి నీరు తాగాలి. – మెగ్నిషియం, క్యాల్షియం, పొటాషియం, సోడియం వంటి పోషకాలు ఉన్న కొబ్బరి నీరు తాగడం వల్ల గర్భవతులకు మలబద్ధకం, జీర్ణకోశంలో సమస్యలు తలెత్తవు.
- పాలిచ్చే తల్లులు ఈ నీళ్ల తాగితే పాల ద్వారా వారి బిడ్డలకు ఈ పోషకాలు అందుతాయి. కొబ్బరి నీరు తల్లి పాలలో చేరి లారిక్ యాసిడ్‌ను పెంచుతుంది. దీనిలో యాంటీఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు ఉంటాయి. కాబట్టి చిన్నపిల్లలు అనేక ఇన్ ఫెక్షన్ల నుంచి రక్షించబడతారు.
- పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు రక్తపోటును తగ్గించడంలో సహకరిస్తాయి.
- కొబ్బరి నీరు మూత్రకోశ ఇన్‌ఫెక్షన్లు, మూత్రపిండంలో రాళ్లను తగ్గించడంలో సహాయపడతాయి.
- రాత్రి నిద్రపోయే ముందు కొబ్బరి నీళ్లను ముఖంపై రాసుకుంటే మొటిమలు, మచ్చలు తొలగిపోతాయి.


కొత్త సినిమాలకు 'ఉగాది'

సినిమాలకూ, ఉగాది పండుగకూ ఎంతో అవినాభావ సంబంధం ఉంది. అనేక చిత్రాల్లోని పాటలు ఉగాది ప్రాధాన్యాన్ని కళ్లకు కట్టినట్టు వివరిస్తాయి. అలాగే, తెలుగు ఏడాది ప్రారంభం సందర్భంగా సినిమాల విడుదలలూ, కొత్త సినిమాల షూటింగులు ప్రారంభమూ ఒక ఆనవాయితీగా వస్తోంది.

'అన్ని రోజులూ ఒకేలా ఉండవు. అలా అని ప్రతిరోజూ పండుగలా ఉండకూడదని కాదు. నిజానికి ప్రతిరోజూ ఉగాది కావాలి. అన్ని భావోద్వేగాలనూ షడ్రుచులలా ఆస్వాదించాలి' అని అంటారు సినీ కవి సిరివెన్నెల సీతారామశాస్త్రి. 'చేదైనా గాని ఇష్టంగానే తింటున్నామంటే ఉగాది అనుకోమా.' అని సీతమ్మవాకిట్లో సిరిమల్లెచెట్టు' సినిమాలో 'మరీ అంతగా మహా చింతగా...' పాటలో రాశారు. జీవితానికి మరో కొత్త ప్రారంభం (కొత్త సంవత్సరం) అనుకుంటున్న రోజు. అదే కదా ఉగాది. ఉగాది పచ్చడి రుచుల్లో చేదు, కారం కూడా ఉంటాయి. అవి ఇష్టంగా తీసుకుంటున్నాం. ఆ రుచులను జీవితానికి అన్వయించుకుంటే కష్టాలు వచ్చినప్పుడు అవసరమైన దాని కంటే ఎక్కువగా తల్లడిల్లిపోము. తల్లడిల్లకూడదని కాదు. ఎక్కువ తల్లడిల్లకూడదని నా అభిప్రాయం అని ఆయన అంటారు. ఆస్కార్ అవార్డు సినీ గేయరచయిత చంద్రబోస్ కూడా 'ఉగాది' సినిమాలో ఉగాది షడ్రుచుల గురించి పాట పాడారు. 'ఈ జన్మమే రుచి చూడటానికి దొరికెరా.. ఈ లోకమే వండి వార్చటానికి వెదికెరా.... బతుకుపండుగ చేయరా' అంటూ సాగుతుంది ఆ పాట. ఇంకా పలు సినిమాల్లో కూడా ఉగాది పండుగ ప్రాశస్త్యాన్ని తెలియజేస్తూ పాటలొచ్చాయి. వందేళ్ల తెలుగు సినీ చరిత్రలో పలు సినిమాల్లో ఉగాది పండుగ గురించి వీనుల విందైన పాటలొచ్చాయి. మచ్చుకు కొన్ని పాటల గురించి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

2003లో వచ్చిన 'శివమణి' సినిమాలో 'రామా రామా రామా నీలీ మేఘ శ్యామా', 1953లో వచ్చిన 'బతుకు తెరువు' సినిమాలో 'వచ్చేనమ్మా వచ్చెనే ఉగాది పండుగ వచ్చేనే', 1989లో 'పూలరంగడు' సినిమాలో 'ఏడాదికొక్కటే అందరికీ ఉగాది', 2020లో వచ్చిన 'ఎంతమంచివాడవురా'లో 'ఏమో ఏమో ఏ గుండెల్లో ఏ బాధ ఉందో', 2008లో 'ఆవకాయ బిర్యాని' సినిమాలో 'మామిడి కొమ్మకి మా చిలకమ్మకు', 1960లో వచ్చిన 'కులదైవం' సినిమాలో 'ఆడీ పాడెను నా మది ఈ వేళ', 1994లో 'ఓ తండ్రి ఓ కొడుకు' సినిమాలో 'ఉగాది వేళా చిలిపిగా చిలిపిగా కోకిలమ్మ' అంటూ పాటలు సాగాయి. 2004లో 'శ్రీ ఆంజనేయం'లో 'రామ రామ రఘురామా' అని పాట సాగుతుంది. 'ఉగాది ఉయ్యాలలో ఊగుతూ రాగాలు తీసింది' అంటూ సాగే ప్రయివేటు సాంగ్ కూడా అత్యంతగా ఆకట్టుకుంటుంది.

1997లో 'ఉగాది' సినిమా ఎస్‌వి కృష్ణారెడ్డి స్వీయ దర్శకత్వంలో వచ్చింది. ఆయనే కథానాయకుడు. కథానాయికగా లైలా నటించారు. 2007లో కన్నడ భాషలో ఓం సాయి ప్రకాష్ దర్శకత్వంలో మెగా హిట్ ప్రొడక్షన్స్ ద్వారా 'ఉగాది' సినిమా వచ్చింది. వి.రవిచంద్రన్, శ్రీకాంత్, కామ్మాజెత్మలానీ, జెన్నీఫర్ కొత్వాల్ నటించారు. నాగార్జున, ప్రభుదేవా నటించిన దశరథ్ దర్శకత్వంలో విజయవంతమైన తెలుగుచిత్రం 'సంతోషం'(2002)కి ఈ చిత్రం రీమేక్.









ఈ ఏడాది క్రేజీ కాంబినేషన్స్ షురూ...

ఏడాది క్రేజీ కాంబినేషన్స్‌లో కొన్ని భారీ సినిమాలకు ముహూర్తాలు పెట్టబోతున్నారు. దర్శకులు, నిర్మాతలు ఎలాంటి అప్‌డేట్స్ ఇస్తారోనని సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చిరంజీవి, మల్లిడి వశిష్ఠ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'విశ్వంభర' నుంచి ఓ గ్లింప్స్ సుస్మిత కొణిదెల, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి పండుగ రోజు వచ్చే అవకాశం ఉంది. బాలకృష్ణ, కెఎస్ రవీంద్రల కాంబినేషన్‌లో 'అఖండ2' సినిమా రానుంది. హరీష్‌శంకర్ కొత్త సినిమా ప్రకటన కూడా ఉంటుందని సమాచారం. నాగార్జున, ధనుష్‌ల 'కుబేర'తోపాటుగా మరో మల్టీస్టారర్ కూడా ఉంటుందని తెలుస్తోంది. ప్రభాస్ కల్కి2898 ఏడీ విడుదల తేదీపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. మారుతి 'రాజాసాబ్' నుంచి మరో 'లైవ్' పోస్టర్ రావొచ్చునని వినికిడి. రామ్‌చరణ్, బుచ్చిబాబు సినిమా నుంచి కాన్సెప్ట్ పోస్టర్ రిలీజ్ అవుతుంది. ఇక 'గేమ్‌ఛేంజర్' నుంచి ఆ రోజు స్పెషల్ సర్‌ప్రైజ్ ఉంటుందని చెబుతున్నారు. ఎన్‌టిఆర్ 'దేవర' అప్‌డేట్‌తోపాటు 'వార్2' పోస్టర్ విడుదల కానుంది. అల్లు అర్జున్, అట్లీ సినిమా ప్రకటన కూడా ఆ రోజు వచ్చే అవకాశం ఉంది. ఎఫ్2, ఎఫ్3 తర్వాత అనిల్ రావిపూడి, వెంకటేష్ కాంబినేషన్ మూడోసారి రిపీట్ అవ్వబోతోంది. భగవంత్ కేసరి తర్వాత అనిల్ రావిపూడి తీస్తున్న సినిమా ఇది. ఉగాది రోజునే ఈ సినిమాకు శ్రీకారం చుట్టబోతున్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం' అనే టైటిల్‌ను ప్రకటిస్తారని సమాచారం. పవన్‌కళ్యాణ్, సుజీత్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న గ్యాంగ్‌స్టార్ యాక్షన్ చిత్రం 'ఓజీ'. ఈ సినిమా స్పెషల్ టీజర్ కూడా ఈ ఉగాదికే ప్లాన్ చేస్తున్నారు. హీరో మహేష్‌బాబు, ఎస్ఎస్ రాజమౌళి సినిమా అధికార ప్రకటన కూడా ఉగాది రోజునే రాబోతుంది. హనుమాన్‌కు సీక్వెల్‌గా 'జై హనుమాన్' సినిమా ఫస్ట్‌లుక్ ఆ రోజే రాబోతుంది.

ముంబయి మురిసింది

ముంబయి ఇండియన్స్‌కు తొలి గెలుపు

ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘన విజయం

షెఫర్డ్, బుమ్రా, డేవిడ్ మెరుపులు

ముంబయి 234/5, ఢిల్లీ 205/8



ముంబయి మురిసింది. ఎట్టకేలకు ముంబయి ఇండియన్స్ ఓ విజయం సాధించింది. ఐపీఎల్ 17సీజన్‌లో వరుసగా మూడు పరాజయాలు చవిచూసిన ముంబయి ఇండియన్స్ ఆదివారం వాంఖడెలో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. భారీ స్కోర్లు నమోదైన మ్యాచ్‌లో పంత్‌సేనపై 29 పరుగుల తేడాతో పాండ్యసేన గెలుపొందింది. రొమారియో షెఫర్డ్, టిమ్ డేవిడ్, జస్‌ప్రీత్ బుమ్రా మెరుపు ప్రదర్శనతో ముంబయి ఇండియన్స్ పాయింట్ల ఖాతా తెరిచింది.

ముంబయి : పరుగుల వరద పారిన వాంఖడెలో ముంబయి ఇండియన్స్ పైచేయి సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్‌పై 29 పరుగుల తేడాతో గెలుపొందిన ముంబయి ఇండియన్స్ ఐపిఎల్ 17 సీజన్లో తొలి విజయం నమోదు చేసింది. 235 పరుగుల రికార్డు ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ పోరాడినా ఓటమి తప్పలేదు. ట్రిస్టన్ స్టబ్స్ (71 నాటౌట్, 25 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్స్‌లు), పృథ్వీ షా (66, 40 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), అభిషేక్ పోరెల్ (41, 31 బంతుల్లో 5 ఫోర్లు) కదం తొక్కినా క్యాపిటల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 205 పరుగులకే పరిమితమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 234 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (49, 27 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (42, 23 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) సహా టిమ్ డేవిడ్ (45 నాటౌట్, 21 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), రొమారియో షెఫర్డ్ (39 నాటౌట్, 10 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) విధ్వంసక ఇన్నింగ్స్‌లతో చెలరేగారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న రొమారియో షెఫర్డ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. నాలుగు మ్యాచుల్లో ముంబయి ఇండియన్స్‌కు ఇది తొలి విజయం కాగా.. ఐదు మ్యాచుల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇది నాల్గో పరాజయం. ఇక ముంబయి ఇండియన్స్ ఓ అరుదైన రికార్డు నమోదు చేసింది. ఇన్నింగ్స్‌లో ఒక్క అర్ధ సెంచరీ సైతం నమోదు కాకుండా ఓ టీ20 మ్యాచ్‌లో అత్యధిక పరుగులు చేసిన జట్టుగా నిలిచింది.

కలిసికట్టుగా కొట్టారు : టాస్ నెగ్గిన ఢిల్లీ క్యాపిటల్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఆరంభంలో పిచ్ నుంచి అదనపు పేస్ ఆశించిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు నిరాశే ఎదురైంది. ముంబయి ఓపెనర్లు రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్ పవర్‌ప్లేలో ఎదురుదాడి చేశారు. దీంతో తొలి ఆరు ఓవర్లలోనే ముంబయి ఇండియన్స్ 75 పరుగులు పిండుకుంది. రోహిత్ శర్మ మూడు సిక్సర్లు, ఆరు ఫోర్లు కొట్టగా.. ఇషాన్ కిషన్ సైతం రెండు సిక్సర్లు, నాలుగు ఫోర్లతో చెలరేగాడు. తొలి వికెట్‌కు ఓపెనర్లు ఏడు ఓవర్లలోనే 80 పరుగులు జోడించగా ముంబయి ఇండియన్స్ భారీ స్కోరు దిశగా సాగింది. సూర్యకుమార్ యాదవ్ (0) పునరాగమనంలో సున్నా పరుగులకే నిష్క్రమించగా.. కెప్టెన్ హార్దిక్ పాండ్య (39, 33 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), తిలక్ వర్మ (6) మిడిల్ ఓవర్లలో నెమ్మదిగా ఆడారు. కానీ డెత్ ఓవర్లలో ముంబయి ఇండియన్స్ బ్యాటర్లు అరాచకం అంటే ఎంటో చూపించారు. టిమ్ డేవిడ్ (45 నాటౌట్), రొమారియో షెఫర్డ్ (39 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగారు. నోకియా వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో రొమారియో ఏకంగా నాలుగు సిక్సర్లు, రెండు ఫోర్లతో విధ్వంసం సృష్టించాడు. ఆఖరు ఓవర్లో 32 పరుగులు పిండుకున్న షెఫర్డ్ ముంబయి ఇండియన్స్ గతినే మార్చివేశాడు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లు వరుసగా రెండో మ్యాచ్‌లో ఊచకోతకు గురయ్యారు. అక్షర్ పటేల్, ఎన్రిచ్ నోకియా చెరో రెండు వికెట్లు పడగొట్టారు. లలిత్ యాదవ్, రిచర్డ్సన్, నోకియా, ఇషాంత్ శర్మ ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు.

స్కోరు వివరాలు :

ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (బి) అక్షర్ 49, ఇషాన్ కిషన్ (సి,బి) అక్షర్ 42, సూర్యకుమార్ యాదవ్ (సి) ఫ్రాసెర్ (బి) నోకియా 0, హార్దిక్ పాండ్య (సి) ఫ్రాసెర్ (బి) నోకియా 39, తిలక్ వర్మ (సి) అక్షర్ (బి) ఖలీల్ 6, టిమ్ డేవిడ్ నాటౌట్ 45, రొమారియో షెఫర్డ్ నాటౌట్ 39, ఎక్స్‌ట్రాలు : 14, మొత్తం : (20 ఓవర్లలో 5 వికెట్లకు) 234.

వికెట్ల పతనం : 1-80, 2-81, 3-111, 4-121, 5-181.

బౌలింగ్ : ఖలీల్ అహ్మద్ 4-0-39-1, ఇషాంత్ శర్మ 3-0-40-0, జై రిచర్డ్సన్ 4-0-40-0, అక్షర్ పటేల్ 4-0-35-2, లలిత్ యాదవ్ 1-0-5-0, ఎన్రిచ్ నోకియా 4-0-65-2.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్ : పృథ్వీ షా (బి) బుమ్రా 66, డెవిడ్ వార్నర్ (సి) హార్దిక్ (బి) షెఫర్డ్ 0, అభిషేక్ పోరెల్ (సి) డెవిడ్ (బి) బుమ్రా 41, ట్రిస్టిన్ స్టబ్స్ నాటౌట్ 71, రిషబ్ పంత్ (సి) హార్దిక్ (బి) కోయేట్జి 1, అక్షర్ పటేల్ (రనౌట్) 8, లలిత్ యాదవ్ (సి) కిషన్ (బి) కోయేట్జి 3, కుమార్ కుశాగ్ర (సి) తిలక్ (బి) కోయేట్జి 0, జై రిచర్డ్సన్ (సి) ఇషాంత్ (బి) కోయేట్జి 2, ఎక్స్‌ట్రాలు : 3, మొత్తం : (20 ఓవర్లలో 8 వికెట్లకు) 205.

వికెట్ల పతనం : గెరాల్డ్ కోయేట్జి 4-0-34-4, జస్‌ప్రీత్ బుమ్రా 4-0-22-2, ఆకాశ్ మద్వాల్ 4-0-45-0, రొమారియో షెఫర్డ్ 4-0-54-1, మహ్మద్ నబి 2-0-7-0, పియూశ్ చావ్లా 2-0-32-0.

గుజరాత్‌పై లక్నో గెలుపు

లక్నో 163/5, గుజరాత్ 130/10

లక్నో : ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ ఫోబియోను లక్నో సూపర్‌జెయింట్స్ అధిగమించింది. గుజరాత్ టైటాన్స్‌పై తొలిసారి గెలుపొందిన లక్నో సూపర్‌జెయింట్స్.. పాయింట్ల పట్టికలో టాప్-3లోకి చేరుకుంది. 164 పరుగుల ఊరించే ఛేదనలో గుజరాత్ టైటాన్స్ 18.5 ఓవర్లలో 130 పరుగులకే కుప్పకూలింది. స్పిన్నర్ కృనాల్ పాండ్య (3/11), పేసర్ యశ్ ఠాకూర్ (5/30) మ్యాజిక్‌తో లక్నో 33 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టైటాన్స్ తరఫున సాయి సుదర్శన్ (31), గిల్ (19), తెవాటియ (30) మినహా అందరూ విఫలమయ్యారు. అంతకుముందు, మార్కస్ స్టోయినిస్ (58, 43 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెఎల్ రాహుల్ (33, 31 బంతుల్లో 3 ఫోర్లు) రాణించగా లక్నో సూపర్‌జెయింట్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 163 పరుగులు చేసింది.

మార్కస్ అర్ధ సెంచరీ : సొంతగడ్డపై టాస్ నెగ్గిన లక్నో సూపర్‌జెయింట్స్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ ఆ జట్టుకు ఆశించిన ఆరంభం దక్కలేదు. చివర్లో నికోలస్ పూరన్ (32 నాటౌట్, 22 బంతుల్లో 3 సిక్స్‌లు), ఆయుశ్ బదాని (20, 11 బంతుల్లో 3 ఫోర్లు) లక్నో సూపర్‌జెయింట్స్‌కు మెరుగైన ముగింపు అందించారు. కృనాల్ పాండ్య (2 నాటౌట్) అజేయంగా నిలిచాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68